
Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

సంపుటి : 01 సంచిక : 91 హైదరాబాద్ శనివారం 25 - 11 - 2023 పేజీలు : 08 వెల : 04






## కేసీఆర్, కేటీఆర్
# జైలుకెళ్లటం ఖాయం

- మేడ్చల్ నియోజకవర్గం కీసరలో రాజ్ నాథ్ సింగ్ ఎన్నికల ప్రచారం
- కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్న కేంద్రమంత్రి
- కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్ అవినీతిలో కూరుకుపోయాయని ఆరోపణ
- బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం
- మేడ్చల్ బీజేపీ అభ్యర్థికి సుదర్శన్ రెడ్డికి మద్దతుగా ప్రచారం

తెలంగాణవీణ, మేడ్చల్ ప్రతినిధి ;తెలంగాణ ఎన్నికల్లో భాగంగా కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ పలు సభల్లో పాల్గొన్నారు. రాజేంద్ర నగర్, శేరిలింగంపల్లిలో రోడ్ షోలలో అమిత్ షా పాల్గొనగా.. మేడ్చల్ జిల్లా కీసరలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఇద్దరు నేతలు బీఆర్ఎస్ సర్కార్ మీద, కేసీఆర్ మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీజేపీ అధికారంలోకి రాగానే కేసీఆర్, కేటీఆర్‌ను జైలుకు పంపిస్తామంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఎన్నికల వేళ బీజేపీలోని అగ్రనాయకులంతా ప్రచార బాట పట్టారు. అందులో భాగంగా.. కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తెలంగాణలోని ఆయా ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో రోడ్ షోలలో పాల్గొన్న అమిత్ షా.. కీలక వ్యాఖ్యలు చేశారు. రాజేంద్రనగర్ ఉగ్రవాదులకు అడ్డాగా మారిందని అమిత్ షా ఆరోపించారు. రాజేంద్రనగర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారని గుర్తు చేశారు. ఎంఐఎం సాయంతోనే ఉగ్రవాదులు హైదరాబాద్‌లో తలదాచుకుంటున్నారని ఆరోపించారు. ఉగ్రవాదులను ఎన్ఐఏ అధికారులు పట్టుకునే వరకు.. ఇక్కడి పోలీసులు ఏం చేస్తున్నారంటూ అమిత్ షా ప్రశ్నించారు. సీఎం కేసీఆర్‌కు ఓవైసీ భయం పట్టుకుందని.. అందువల్లే సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడం లేదని అమిత్ షా ఆరోపించారు. కారు పార్టీ స్టీరింగ్ ఎంఐఎం చేతిలో ఉందన్న అమిత్ షా.. దేశంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వం బీఆర్ఎస్ సర్కార్ అని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఉగ్రవాదులను ఏరి పారేస్తామన్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన మాట ప్రకారం.. తప్పకుండా ఎస్సీ వర్గీకరణ చేస్తామన్నారు. అవినీతికి పాల్పడినా ఎవ్వరూ ఏమి చేయలేరని విర్రవీగుతున్న కేసీఆర్, కేటీఆర్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వంలో జైలుకు పంపిస్తామని చెప్పుకొచ్చారు. మరోవైపు.. మేడ్చల్ జిల్లా కీసర మండలం రాంపల్లిలో నిర్వహించిన ప్రచార సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్

మిగతా 2లో..

## బీఆర్ఎస్ పాలనలో కొరవయిన
# సంతోషం

### బీఆర్ఎస్ ప్రభుత్వం యువత భవిష్యత్తును చీకట్లోకి నెట్టింది



- ప్రాజెక్టులు పూర్తి కాలేదు ప్రియాంక
- కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉన్నారు.. ఎక్స్‌పైరీ డేట్ అయిపోయిందని ఎద్దేవా
- పేపర్ లీకేజీలను అరికడతామన్న ప్రియాంక గాంధీ
- కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అందరి ఆకాంక్షలు నెరవేరలేదని ఆవేదన
- పాలకుర్తి సభలో ప్రియాంక గాంధీ మండిపాటు

తెలంగాణ వీణ, సిద్దిపేట : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ విజయభేరి భారీ బహిరంగ సభ లో ప్రసంగించారు. ప్రియాంక గాంధీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎం మాట్లాడాలో, ఎవరి గురించి చెప్పాలో అది చెప్పాలని వచ్చాను. బిఆర్ఎస్ పాలనలో ప్రజలు ఎవరు సంతోషంగా లేరు, గౌరవెల్లి, గండిపల్లి, తోటపల్లి ప్రాజెక్టులు పూర్తయ్యాయా. ముఖ్యమంత్రి కేసీఆర్ దత్తత తీసుకున్న ముల్కనూర్ గ్రామంలో ఏమయిన అభివృద్ధి జరిగిందా. స్థానిక ఎమ్మెల్యే భూ నిర్వాసితుల పక్షాన

మిగతా 2లో..



## కాంగ్రెస్ పార్టీ సింగరేణిని
# ముంచింది

- చేతకాక కేంద్రానికి తాకట్టు పెట్టింది
- హస్తం పార్టీకి అధికారం వస్తే దళారులదే రాజ్యం
- రామగుండంలో అనువైన పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం
- బిఆర్ఎస్ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కేసీఆర్



తెలంగాణ వీణ, గోదావరిఖని : కాంగ్రెస్‌కు చేతగాక సింగరేణిని సమైక్య చేతల చేతుల్లో పెట్టారని సీఎం కేసీఆర్ విమర్శించారు. పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సింగరేణి 134 ఏళ్ల కింద పుట్టిన మన సొంత కంపెనీ. నిజాం రాజు కాలంలో పుట్టిన కంపెనీ. మన సొంత ఆస్తి. ఈ కాంగ్రెస్ దద్దమ్మ నాయకులకు చేతగాక సమైక్య నాయకుల చేతిలో పెడితే కేంద్రం దగ్గర అప్పులు తెచ్చారు. రూ.600కోట్ల మారటోరియం సింగరేణి మీద ఉండేది. ఆ అప్పులు కట్టుడు చేతగాక మా వల్లకాదని చేతులెత్తేసి కేంద్రానికి 49శాతం వాటా పుట్టించారు. మన సింగరేణి వందశాతం మనకే ఉంటుండే. అలా లేకుండా చేసిందే కాంగ్రెస్' అంటూ విమర్శించారు. 'తెలంగాణను ఆంధ్రాలో కలిపిందే కాంగ్రెస్. గోదావరి ఒరుసుకుంటు పారే మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల్లో మంచినీళ్ల గోస, కరెంటు గోస. చేనేత కార్మికుల చనిపోవుడు. రైతులు ఆత్మహత్యలు చేసుకునుడు. కరెంటు ఇస్తే తెల్లందాక ఇంత. పొద్దందాక ఇంత. ఆడ పాములు కరిచి చనిపోవుడు. విపరీతమైన బాధలు పడ్డాం. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు ఉండే. వాటిని ఊడగొట్టింది కాంగ్రెస్సే కదా?

మిగతా 2లో..

## బీజేపీ, బీఆర్ఎస్ లు
# రెండు కుమ్మక్కు

- ఉద్యమం సమయంలో కోమటిరెడ్డి ఆమరణ నిరాహార దీక్ష చేశారు
- పార్టీ ఫిరాయించిన 12 మంది ఎమ్మెల్యేలను మళ్లీ అసెంబ్లీ గేటు తాకనీయవద్దని విజ్ఞప్తి
- కేసీఆర్ ఎలక్షన్లు.. కలెక్షన్ల కోసమే ఉద్యమం సమయంలో రాజీనామా చేశారని ఆరోపణ



తెలంగాణ వీణ, హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ, బీజేపీ కుమ్మక్కు అయ్యాయని.. రెండు పార్టీలు ఒక్కటై.. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నాయని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణలో ప్రతిపక్షమే ఉండకూడదు.. ప్రశ్నించే గొంతులే ఉండరాదన్న నియంతృత్వ పోకడలతో బీఆర్ఎస్, బీజేపీ వ్యవహరిస్తున్నాయని.. ఆ రెండు పార్టీల్లో చేరిన వారు పవిత్రులు.. కాంగ్రెస్ పార్టీలో చేరితే ద్రోహులు ఎలా అవుతారని ప్రశ్నించారు రేవంత్ రెడ్డి. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య కుదిరిన కామన్ మినిమమ్మ ప్రోగ్రాంలో భాగంగానే.. కాంగ్రెస్ పార్టీలో చేరిన, కాంగ్రెస్ పార్టీ నేతలపై ఈడీ, ఐటీ దాడులు చేయిస్తు ?న్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ కనుసన్నల్లోనే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పని చేస్తుందని.. ఇద్దరూ అనుకునే కాంగ్రెస్ నేతలపై ఈడీ, ఐటీ దాడులు చేయిస్తున్నారని తెలంగాణ ప్రజల దృష్టికి తీసుకొచ్చారు. ఇందులోనే భాగంగానే చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన వివేక్ వెంకటస్వామి పైనా ఈడీ దాడులు చేయించారంటూ లేఖ ద్వారా ప్రజలకు వివరించారు రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని తెలిసిన తర్వాతే.. దాడులు పెరిగిన విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. కేసీఆర్, అమిత్ షా రచించిన

మిగతా 2లో..

## బర్రెలెక్కకు
# భద్రత
### హై కోర్ట్ ఆదేశం



## మా రాష్ట్రానికి
# చాలా నష్టం

- జగన్ సర్కార్‌పై తెలంగాణ ఫిర్యాదు
- ఏపీపై కేఆర్ఎంబీకి తెలంగాణ ఫిర్యాదు
- వరికపూడిశెల ప్రాజెక్టుపై అభ్యంతరం
- అనుమతులు లేవని ఫిర్యాదు చేశారు

తెలంగాణ వీణ, హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి అనుమతులు పొందకుండానే కృష్ణానదిపై వరికపూడిశెల ఎత్తిపోతల పథకాన్ని చేపట్టిందని కృష్ణాబోర్డుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫిర్యాదు చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్ విభజన చట్టం 2014 మేరకు అనుమతులు పొందకుండా కొత్త ప్రాజెక్టులేవి చేపట్టరాదని గుర్తు చేసింది. ఏవైనా కొత్త ప్రాజెక్టులు చేపట్టాలంటే.. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి అధ్యక్షతన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో జరిగే అపెక్స్ కౌన్సిల్

మిగతా 2లో..





# బీజేపీ, బీఆర్ఎస్ లు రెండు కుమ్మక్కు

మొదటిపేజీ తరువాయి..
ప్రణాళికను పియూష్ గోయల్, కేటీఆర్ అమలు చేస్తున్నారని రేవంత్ ఆరోపించారు. ప్రతి రోజూ సూర్యుడు అస్తమించగానే.. వీళ్ల కుట్రలకు రచన జరుగుతుందని తెలిపారు. అర్ధరాత్రులు ఇళ్లపై దాడులు చేయటం ఏంటని నిలదీస్తూనే.. ఈ విషయాలను తెలంగాణ సమాజం తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు రేవంత్ రెడ్డి. కేసీఆర్ కు వందల కోట్లు ఇచ్చిన వ్యక్తుల జోలికి ఎందుకు వెళ్లటం లేదని.. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయినా ఆ సంస్థలు.. కేసీఆర్ ను ఎందుకు ప్రశ్నించటం లేదని నిలదీశారు రేవంత్ రెడ్డి.కాంగ్రెస్ పార్టీలో చేరిన వివేక్ వెంకటస్వామి, పొంగులేటి, కేఎల్ఆర్, తుమ్మల ఇళ్లు, ఆఫీసులపై ఐటీ, ఈడీ దాడులు చేయటం వెనక కుట్ర ఉందన్నారు రేవంత్ రెడ్డి. పోటీ చేస్తున్న అభ్యర్థుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై లేదా అని ప్రశ్నించారాయన. బీఆర్ఎస్, బీజేపీ పతనం మొదలైందని.. కుట్ర రాజకీయాలకు కాలం చెల్లిందని హెచ్చరించారాయన. మీ కవ్వింపు చర్యలు, కుట్ర రాజకీయాలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో మరింత కసిని పెంచాయని.. వివేక్ వెంటకస్వామి కుటుంబంపై దాడిని.. కాంగ్రెస్ పార్టీపై దాడిగానే భావిస్తామని బహిరంగ లేఖ ద్వారా వెల్లడిరచారు రేవంత్ రెడ్డి. ఎన్ని ఇబ్బందులు, కుట్రలు చేసినా కాంగ్రెస్ పార్టీ విజయాన్ని.. తెలంగాణ ప్రజల విజయాన్ని ఆపలేరన్నారు.

# బర్రెలెక్కకు భద్రత



తెలంగాణ వీణ, హైదరాబాద్ : కొల్లాపూర్ స్వాతంత్ర్య అభ్యర్థి బర్రెలెక్క కు భద్రత కల్పించాలని హై కోర్ట్ ఆదేశించిదని ఆమె తరపు న్యాయవాది రామేశ్వర రావు వెల్లడిరచారు. బర్రెలెక్క (శిరిష) కుఎన్నికలు పూర్తయ్యే వరకు భద్రతకల్పించాలి. ఆమె నిర్వహించే పబ్లిక్ మీటింగ్ లకు భద్రత కల్పించాలని హై కోర్ట్ ఆదేశించింది. గేర్తింపు ఉన్న పార్టీలకే భద్రత ఇస్తే సరిపోద్దు. త్రేట్ ఉందని అభ్యర్థించే అభ్యర్థులకు సెక్యూరిటీ కల్పించాలి.అభ్యర్థుల భద్రత బాధ్యత ఎన్నికల కమిషన్ దే. పోలీసులు కేవలం కార్లు చెక్ చేస్తాం అంటే కుదరదు. బర్రెలక్క కు ఒక గన్మేన్ తో భద్రత కల్పించాలని హై కోర్ట్ ఆదేశించినట్లు అయన అన్నారు. ఎన్నికలు పూర్తి అయ్యే వరకూ ఒక గన్ మెన్ ఆమె వెంట ఉండాలని, ఆమె నిర్వహించబోయే పబ్లిక్ మీటింగ్ లకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. కేవలం గుర్తింపు ఉన్న పార్టీలకు మాత్రమే భద్రత కల్పించడం సరికాదని, ముప్పు ఉన్న ప్రతి అభ్యర్థికి సెక్యురిటీ ఇవ్వాలని హైకోర్టు నిర్దేశించింది. పోలీసుల బాధ్యత కేవలం కార్లు చెక్ చేయడం కాదని కీలక వ్యాఖ్యలు చేసింది. రెండు రోజుల క్రితం కొల్లాపూర్ లో ప్రచారం నిర్వహిస్తున్న బర్రెలక్కపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్ల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బర్రెలక్కతో పాటు ఆమె తమ్ముడిపై కూడా దాడి చేశారు. ఆమె తమ్ముడిని తీవ్రంగా గాయాలపాలు చేశారు.ఈ దాడి నేపథ్యంలోనే తనకు 2 G 2 గన్ మెన్లతో భద్రత కల్పించాలని బర్రెలక్క తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేసింది. శుక్రవారం (నవంబరు 24) దీనిపై విచారణ జరిగింది. హైకోర్టుకు వెళ్లడానికి మద్దతుగా అంతర్జాతీయ న్యాయవాదుల సంఘం నాయకులు కావేట శ్రీనివాసరావు, కరణం రాజేశ్, ఆదిత్య దొడ్డల అండగా ఉన్నారు. బర్రెలక్కకు రక్షణ కల్పించాలని ఎస్పీని కూడా కోరతామని అన్నారు.

# మా రాష్ట్రానికి చాలా నష్టం

మొదటిపేజీ తరువాయి..
సమావేశంలో చర్చించాలి. ఆ తర్వాత అందరి ఆమోదం మేరకు కేంద్ర జలసంఘం నుంచి, కృష్ణానదీయాజమాన్య బోర్డు నుంచి అనుమతులు పొందాలని స్పష్టం చేసింది. జగన్ సర్కార్‌పై తెలంగాణ కేఆర్ఎంబీ (కృష్ణా నదీ యాజమాన్య బోర్డు) ఛైర్మన్‌కు ఫిర్యాదు చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పల్నాడు జిల్లా మాచర్ల దగ్గర నిర్మించతలపెట్టిన వరికపూడిశెల ఎత్తిపోతల పథకంతో తమ ప్రాజెక్టులకు నష్టం వాటిల్లనుందంటూ తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. దీనిపై ముందుకు వెళ్లకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలంటూ కేఆర్ఎంబీ ఛైర్మన్‌కు తెలంగాణ నీటి పారుదలశాఖ ఈఎన్‌సీ సి మురళీధర్ తాజాగా లేఖ రాశారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం కేంద్ర జలసంఘం, కేఆర్ఎంబీ, ఎపెక్స్ కౌన్సిల్ అనుమతి లేకుండా కొత్త ప్రాజెక్టులు చేపట్టకూడదని లేఖలో ప్రస్తావించారు. ఏపీ ప్రభుత్వం చేపట్టదలచిన ప్రాజెక్టుతో తెలంగాణ ప్రాంత ప్రాజెక్టుల్లో నీటి లభ్యత కష్టంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనల ఉల్లంఘనలను కేంద్ర జలశక్తి శాఖ దృష్టికి తీసుకెళ్లాలని ఆ లేఖలో ఈఎన్‌సీ కోరారు. కృష్ణానదీ ఆధారంగా నాగార్జున సాగర్ రిజర్వాయర్ బ్యాక్‌వాటర్‌పై నిర్మిస్తున్న ఈ ఎత్తిపోతల పథకం పూర్తిగా అక్రమం అంటోంది తెలంగాణ ప్రభుత్వం. ఈ ఎత్తిపోతల పథకం నిర్మించటం వల్ల తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పలు సాగునీటి ప్రాజెక్టులపైన ప్రతికూల ప్రభావం పడుతుందని లేఖలో ప్రస్తావించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు అధారంగా ఉన్న ఆయకట్టు ప్రాంతాలపై కూడా ప్రభావం పడుతుందన్నారు. వరికపూడిశెల ఎత్తిపోతల పథకం పనులను వెంటనే నిలిపివేయించాలని కోరింది. అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి కేంద్రజలసంఘం, కృష్ణాబోర్డుల ఆమోదం పొందిన తరువాతనే ఈ పథకం చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఎత్తిపోతలకు సంబంధించి జారీ చేసిన జీవో నంబర్ 104ను కూడా ఫిర్యాదు చేసింది. వరికపూడిశెల వాగు దగ్గర ఈ లిఫ్ట్ హెడ్ వర్క్‌కు చెందిన వివరాలను కూడా బోర్డుకు అందజేసింది. వెల్దుర్తి మండలం పరిధిలోని గంగులకుంట గ్రామం సమీపాన ఈ పనులు చేపట్టినట్టు తెలిపింది. ఏవైనా కొత్త ప్రాజెక్టులు చేపట్టాలంటే కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి అధ్యక్షతన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో జరిగే అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో చర్చించి ఆందరి ఆమోదయోగ్యం మేరకు కేంద్ర జలసంఘం నుంచి, కృష్ణానదీయాజమాన్య బోర్డు నుంచి అనుమతులు పొందాలని గుర్తు చేసింది. దశలవారీగా మొత్తం రూ.3809కోట్ల వ్యయంతో వరికపూడిశెల ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తున్నట్టు బోర్డు దృష్టికి తీసుకెళ్లింది. ఈ పథకం ద్వారా నాగార్జున సాగర్ జలాశయంలోని వెనుక జలాల రోజుకు 281 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసి సాగునీటికి తాగునీటికి సరఫరా చేసేందుకు ప్రాజెక్టును చేపట్టిందని తెలిపింది. వరికపూడిశెల ఎత్తిపోతల పథకం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎటువంటి అనుమతులు పొందలేదని ప్రధానంగా ప్రస్తావించింది తెలంగాణ సర్కార్. ఈ ఫిర్యాదుపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఎలా స్పందిస్తుంది అన్నది చూడాలి. ఈ వరికపూడిశెల ఎత్తిపోతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇటీవలే శంకుస్థాపన చేశారు.. ఇంతలోనే తెలంగాణ ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది.

# బీఆర్ఎస్ పాలనలో కొరవయిన సంతోషం





మొదటిపేజీ తరువాయి..
మాట్లాడడా, 10 సంవత్సరాలు గడుస్తున్న నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాడా అని ప్రశ్నించారు. వడ్ల తూకంలో ఎక్కువ తరుగు తీస్తున్న స్థానిక ఎమ్మెల్యే ఏం చేశాడు. ఆయన కుటుంబ సభ్యులకు మంత్రి పదువులు ఇచ్చాడు కానీ, ఒక్కరికి కూడా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వలేదు. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణంలో చాలా అవినీతి జరిగింది, రైతుల రుణమాఫీ చెయ్యలేదు. రాజస్థాన్, ఛత్తీస్ ఘడ్, కర్ణాటక లో కాంగ్రెస్ రైతులకు రుణ మాఫీ చేసింది. ఆదాని కి దేశంలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ అప్పగిస్తున్నాడని అన్నారు. రైతు ఒక్కరోజులో 70 రూపాయలు సంపాదిస్తుంటే, అదాని మాత్రం 16 వందల కోట్లు సంపాదిస్తున్నారు. 10 సంవత్సరాలు బిఆర్ఎస్ పాలన చూశారు, ఇప్పుడు కాంగ్రెస్ రాష్ట్ర అభివృద్ధికి ఒక ప్రణాళిక తో మీ ముందుకు వచ్చింది. ఎంఐఎం తెలంగాణలో పుట్టిన పార్టీ దేశంలో వివిధ రాష్ట్రాల్లో 50, 60 సీట్లలో పోటీ చేస్తుంటే రాష్ట్రంలో 8,9 సీట్లకు ఎందుకు పోటీ చేస్తుంది. ఓవైసీ ఎప్పుడు రాహుల్ గాంధీ ని నిందిస్తారు, కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ప్రజలను రాహుల్ గాంధీ కలిశారు.బిఆర్ఎస్ బిజెపి ఎంఐఎం కాంగ్రెస్ను అధికారంలోకి రాకుండా అడ్డుకుంటున్నాయి, ఎందుకంటే వల్ల అవినీతి సొమ్మును బయటికి తీసి, ప్రజలకు పంచుతమని అన్నారు. సోనీయామ్మ తెలంగాణ ఇచ్చింది కాబట్టి ఆమెను మీరు గౌరవిస్తారు. మహాత్మా గాంధీ నుండి ఇప్పటి వరకు మేము ప్రజల కోసం కొట్లడతున్నము. ప్రజల సంపద ప్రజలకే చెందలని కాంగ్రెస్ చూస్తుంది.కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారం లోకి రాగానే 6 గ్యారంటీలు అమలు చేస్తాం.ఛత్తీస్ ఘడ్, కర్ణాటక రాష్ట్రాల్లో చేసి చూపించాం. హుస్నాబాద్ లో మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని అన్నారు. మీరు ఈ సారి కాంగ్రెస్ పార్టీని గెలిపించండి, కాంగ్రెస్ మీ అభివృద్ధి కోసం పాటుపడుతుంది. మీరు ఈ సారి కాంగ్రెస్ పార్టీని గెలిపించండి, 5 ఎండ్ల తరవాత వచ్చి నేను ఇదే వేదిక పైన ఎం చేశామో గర్వంగా మాట్లాడుతాను.తెలంగాణ కోసం కొట్లదింది మీరు, రాష్ట్రం మీది, మీకోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుంది.ఈ కార్యక్రమంలో.. అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ మాజీ ఎమ్మెల్యేలు చాడ వెంకటరెడ్డి,అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ ప్రభుత్వం యువత భవిష్యత్తును చీకట్లోకి నెట్టింది**

'నా కోసం చాలాసేపటి నుంచి ఎదురు చూస్తున్నారు మీ ఇంటి పనులు వదులుకొని మరీ వచ్చారు... మీ అందరికీ క్షమాపణలు చెబుతున్నా' అని ఏఐసీసీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ అన్నారు. పాలకుర్తిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉన్నారని, ఎక్స్‌పైరీ డేట్ అయిపోయిందని ఎద్దేవా చేశారు. మార్పు రావాలి కాంగ్రెస్ రావాలని నినదించారు. కేసీఆర్ తాను ఇచ్చిన ఎన్నో హామీలను నెరవేర్చలేదన్నారు. రైతులకు రుణమాఫీ చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో రుణమాఫీ అమలు చేసినట్లు చెప్పారు. మీ ఓటు చాలా విలువైనదని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల త్యాగాల వల్లే తెలంగాణ ఏర్పడిందని, అలాంటి రాష్ట్రం అభివృద్ధి చెందాలని తాము భావించామన్నారు. కానీ ప్రజల ఆకాంక్షలు ఈ పదేళ్ల కాలంలో నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమంది ప్రాణత్యాగం చేస్తే వచ్చిన తెలంగాణలో అమరుల ఆకాంక్షలు నెరవేరాయా? ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అందరి ఆకాంక్షలు నెరవేరాలన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే నిరుద్యోగుల కష్టాలు తొలగిపోతాయని హామీ ఇచ్చారు. ఈ పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చింది? అని ప్రశ్నించారు. నిరుద్యోగంలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షలు లీక్ కావడంతో యువతను తీవ్ర నిరుత్సాహానికి గురి చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని హామీ ఇచ్చారు.పేపర్ లీకేజీలను అరికడతామని ప్రియాంక గాంధీ అన్నారు. నిరుద్యోగుల ఆత్మహత్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం వక్రీకరించిందని విమర్శించారు. ప్రతి మహిళ ఖాతాలో రూ.2500 వేస్తామని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే రూ.500కు గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, రైతుకు ఏడాదికి రూ.15 వేలు, వరికి కనీస మద్దతుతో పాటు రూ.500 బోనస్ ఇస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం యువత భవిష్యత్తును చీకట్లోకి నెట్టిందన్నారు. యువకుల పట్ల కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉందన్నారు. ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. ప్రతి మండలానికి ఇంటర్నేషనల్ స్కూల్ ఇస్తామన్నారు.

# కేసీఆర్, కేటీఆర్ జైలుకెళ్లటం ఖాయం





మొదటిపేజీ తరువాయి..
కూడా.. కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే అవినీతిపరులందరినీ జైలుకు పంపిస్తామని చెప్పుకొచ్చారు. ఈసారి తెలంగాణలో కచ్చితంగా బీజేపీ సర్కారును తీసుకొస్తామని చెప్పుకొచ్చారు. పదేళ్లలో తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్ ఎన్నో హామీలిచ్చారని... అందులో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ కుటుంబం అవినీతిలో కూరుకుపోయిందంటూ రాజ్ నాథ్ సింగ్ విమర్శలు చేశారు.

**బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం**

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మేడ్చల్ నియోజకవర్గం కీసర మండలం, రాంపల్లి లో నిర్వహించిన సకల జనుల విజయ సంకల్ప సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మేడ్చల్ బీజేపీ అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డిని బారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు సభకు బారీగా తరలివచ్చారు. తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేసి ప్రభుత్వాన్ని నెలకొల్పుతామని రాజ్ నాథ్ సింగ్ తెలిపారు. పదేళ్ల నుంచి తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. 27 సంవత్సరాలుగా గుజరాత్ ను దేశంలోనే ఒక మాడల్ గా అభివృద్ధి చేశామని, ఇక్కడ ఎందుకు అభివృద్ధి చెందలేదని కేసీఆర్ ను ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ కుటుంబం అవినీతిలో కూరుకుపోయిందన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పనిచేస్తుందన్నారు. అటల్ బిహారీ వాజపేయి నుండి, మోడీ వరకు బీజేపీ ప్రభుత్వాలు నాయకులపై ఏ ఒక్క అవినీతి మచ్చ లేదని అన్నారు. కుంబానికి ఒక్క ఉద్యోగం ఇస్తానని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తామని మోసం చేసి పేపర్ లీకేజీలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులకు మూడు ఎకరాలు భూమి ఇస్తామని ఏ ఒక్క దలితునికి ఇవ్వలేదన్నారు. 10 లక్షల దళితబంధు ఎవరికీ ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి ఉందని బీజేపీ అధికారంలోకి రాగానే అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపిస్తామని రాజ్ నాథ్ సింగ్ హెచ్చరించారు. అనంతరం ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలో సైలెంట్ ఓటింగ్ జరుగుతుందని, తాను చేసిన సేవలే తనను అత్యధిక మెజారిటీతో గెలిపిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనన్నారు. మంత్రి మల్లారెడ్డి కబ్జాలకు అంతేలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ వైపు ఓటర్లు మొగ్గు చూపుతున్నారని, తాను చేసిన సేవలు తనను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ సింగరేణిని ముంచింది

మొదటిపేజీ తరువాయి..
గవర్నమెంట్ కాంగ్రెస్సే. ఒప్పందాలపై సంతకాలు పెట్టి ఉన్న హక్కులను పోగొట్టారు. తెలంగాణ వచ్చిన తర్వాత దాన్ని పునరుద్ధరించుకున్నాం. అంతేకాకుండా 15వేల మందికి ఉద్యోగాలు ఇచ్చుకున్నాం. మీ కండ్ల ముందు జరిగిన చరిత్ర. అనేక కారణాలు ఉన్నయ్. కాంగ్రెస్ వాళ్లు ఉన్నప్పుడు ఇవ్వలేదు. మేం ఇస్తుంటే ఓరుస్త లేరు' అంటూ విమర్శించారు.కులం, మతం లేకుండా కలుపుకుపోతున్నాం.. 'ఎన్నో ఏండ్ల నుంచి పరిష్కారం కానీ సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. అన్ని వర్గాలను, కులం మతం అనే తేడా లేకుండా కలుపుకొని ముందుకు తీసుకుని పోతుంది బీఆర్ఎస్ ప్రభుత్వం. అందుకే మీరు మంచి పద్ధతుల్లో ఆలోచన చేసి ఓటేస్తే మంచి జరుగుతది. చందర్ గురించి మీకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఉద్యమకారుడు. ఉద్యమ కాలంలో 74 రోజులు జైల్లో ఉన్నాడు. ఆయన కూడా సింగరేణి కార్మికుడి కుమారుడు. కాబట్టి సింగరేణి గురించి బాగా అవగాహనం ఉంది. ఇక బొగ్గు, నీళ్లు ఉన్నాయి. రవాణా వసతి ఉంది. ట్రైన్ కూడా ఉంది. మాకు పరిశ్రమలు లేవు అని చందర్ చెప్పారు. రామగుండం నిర్లక్ష్యానికి గురైంది సమైక్య రాష్ట్రంలో. మనం ఇప్పుడు కుదుటపడ్డాం. ఈ ప్రాంతానికి రావాల్సిన పరిశ్రమల గురించి ఆలోచించి తీసుకువస్తాం. దాని కోసం నేను కృషి చేస్తాను' అని కేసీఆర్ హామీ ఇచ్చారు. సింగరేణి తో పాటు తెలంగాణను ముంచింది కాంగ్రెస్ పార్టీ అని బిఆర్ఎస్ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆరోపించారు. శుక్రవారం గోదావరిఖని జవహర్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన బి ఆర్ ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు ఆయన హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు చేతకాక సింగరేణి కేంద్రానికి 49శాతం తాకట్టు పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ ,సిపిఐ అనుబంధ కార్మిక సంఘాలు డిపెండెంట్ ను, సంతకాలు పెట్టి హక్కులను పోగొట్టాయని ఆక్షేపించారు. తెలంగాణ వచ్చిన తర్వాత సింగరేణి పునరుద్ధరించామని,15వేల డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించామని గుర్తు చేశారు. కార్మికులకు 32 శాతం లాభాల వాటా ఇస్తున్నామని ,దీపావళి బోనస్ ,దసరా అడ్వాన్స్ కలిపి సుమారు రూ.1000 కోట్ల వరకు కార్మికులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. తాము ఈ ఎన్నికల్లో గెలిస్తే కార్మికులపై పర్క్స్ పై ఆదాయ పన్ను రద్దు చేస్తామని, రామగుండంలో అనువైన పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఎన్నికలు వస్తే ఆగం కావద్దని, ఆలోచించి ఓటు వేయాలని, విచక్షణారహితంగా ఓటు వేస్తే గోల్మాల్ అవుతామన్నారు. సమాజంలో విధి వంచిత వంచితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదని ఇందులో భాగంగానే పెన్షన్ ను రూ.5016లకు పెంచుతామన్నారు. ప్రైవేటు దోపిడిని అరికట్టేందుకే ప్రసవించిన వారికి కేసీఆర్ కిట్లు అందజేశామని పల్లె బస్తీ దావకణాలు ఏర్పాటు చేశామని ఉచిత కరెంటు, రైతు బంధు అమలు చేస్తున్నామని, అయిదు లక్షల రైతు బీమా, మద్దతు ధర ఇచ్చి రైతులనుంచి పంటలనుకుంటున్నామని కేసీఆర్ వివరించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణి తీసివేస్తామని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారని, ధరణిని తీసివేస్తే రైతు బంధు అందకుండా పోతుందని, దళారులదే రాజ్యమవుతుందని, అన్ని వర్గాల ప్రజలు గోసపడాల్సి వస్తుంద ని హెచ్చరించారు. ఇప్పటికైనా తెలంగాణకు ముందు తెలంగాణ తర్వాత జరిగిన అభివృద్ధి వేసుకొని ఓటు వేయాలని ఈనెల 30న జరగనున్న ఎన్నికలలో రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ కు ఓటు వేసి కారును భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.





## ఏపీ సచివాలయంలో లంచావతారం



తెలంగాణ వీణ, విజయవాడ : ఏపీ సచివాలయంలో ఏసీబీ దాడుల కలకలం రేగింది. సచివాలయం బస్సు షెల్టర్ వద్ద నాటకీయంగా ఆర్థిక శాఖ సెక్షన్ ఆఫీసర్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ దాడి చేసింది. ఆర్థిక శాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న నాగభూషన్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో చిక్కాడు. వెలగపూడి సచివాలయం బస్ షెల్టర్ వద్ద రూ.40,000 లంచం తీసుకుంటుండగా నాగభూషన్‌రెడ్డిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విదేశీ విద్యోన్నత నిధులు మంజూరుకు సంబంధించిన ఫైలును క్లియర్ చేయడానికి నాగభూషణ్ రెడ్డి ఓ విద్యార్థి తండ్రిని లంచం అడిగాడు. అతను ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. నిఘా పెట్టిన ఏసీబీ డబ్బులు తీసుకుంటూండగా అరెస్టు చేశారుఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ లో ఇప్పటి వరకూ ఏసీబీ దాడులు జరగలేదు. ముఖ్యంగా కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏసీబీ అధికారులు ఎలాంటి సోదాలు నిర్వహించలేదు. అయితే హఠాత్తుగా ఇటీవల ఏసీబీ అధికారులు సెక్రటేరియట్ ఉద్యోగులపై ప్రత్యేకంగా నిఘా ఉంచినట్లుగా తెలుస్తోంది. అదే సమయంలో ఏసీబీకి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తూండటంతో.. వాటిపై దృష్టి పెట్టి ఉద్యోగుల అవినీతిని బయట పెట్టాలనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. నేరుగా సెక్రటేరియట్ లో ఏసీబీ దాడులు జరగడం ఉద్యోగ వర్గాల్లో కలకలం రేపింది. సెక్రటేరియట్ లోనే కాకుండా.. అవినీతి గురించి తమకు వచ్చిన ఫిర్యాదులపై స్పందించి ఆధారాలు ఉంటే.. నిఘా పెట్టి.. రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంటున్నామని ఏసీబీ పోలీసులు చెబుతున్నారు. ఇటీవల పలువురు అధికారులు ఇలా దొరికిపోయారు. ఆ తర్వాత ఏపీ ఉద్యోగ సంఘం నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు పోలీసుల తీరుపై మండిపడ్డారు. ఉద్యోగులపై ఏసీబీ దాడులను ఖండిరచారు. సరిగ్గా జీతాలివ్వడం లేదని ఆయినా ఇలా వేధిస్తున్నారని ఆరోపించారు. దీనికి ఏసీబీ అధికారులు ఖండన ప్రకటన ఇచ్చారు. లంచాలు తీసుకుంటే.. ఎవరినైనా అరెస్టు చేస్తామని.. తమకు వస్తున్న ఫిర్యాదుల్లో అత్యధికం రెవిన్యూ అధికారుల లంచాల గురించేనని చెబుతున్నారు. ఎన్నికలకు మూడు నెలల ముందు ఏసీబీ దాడులను పెంచడం వెనుక.. ఉద్యోగులను నోరెత్తకుండా చేసే ప్రయత్నం ఉందని ఉద్యోగ సంఘాల నేతలు అనుమానిస్తున్నారు. ఉద్యోగులు ఎన్నికలకు ముందు ప్రభుత్వం నుంచి తమ కు రావాల్సిన వాటిపై డిమాండ్లు పెట్టడం.. ఆందోళనలు చేయడం సహజమని.. అలాంటివి ఈ సారి ఉండకుండా ఇలా ఏసీబీ దాడులతో బెదిరిస్తున్నారని .. ఉద్యోగ సంఘాలు అనుమానిస్తున్నాయి.

## ధూళిపాళ నరేంద్రకు ముందస్తు బెయిల్



తెలంగాణ వీణ, గుంటూరు : టీడీపీ నాయకుడు ధూళిపాళ్ల నరేంద్రు ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. సంగం డెయిరీ వద్ద జరిగిన ఓ ఘర్షణలో ఘటనా స్థలంలో లేకపోయినప్పటికీ ధూళిపాళ్ల నరేంద్రతో పాటు పలువురిపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. తప్పుడు కేసులు పెట్టారని ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని అందరూ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిగిన హైకోర్టు ధూళిపాళ్ల నరేంద్రతో పాటు ఇతరులకూ ముందస్తు బెయిల్ ఇచ్చింది. ధూళిపాళ్ల నరేంద్ర మందస్తు బెయిల్ పై విచారణ హైకోర్టులో జరగక ముందే.. పోలీసులు ఆయనను అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. వడ్లమూడిలోని సంగం డెయిరీ దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. ఆ ప్రాంతంలో పోలీసులు ఎవర్నీ రానీయకుండా అడ్డుకున్నారు. డెయిరీ లోపలకు వెళ్లేందుకు పోలీసులు యత్నించారు. అనుమతి లేకుండా వెళ్లనీయబోమంటూ డెయిరీ సిబ్బంది పోలీసులను అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనపై నారా లోకేష్ స్పందించారు. సంగం డెయిరీని కబ్జా చేయాలని చూశారు, సాధ్యం కాలేదు. సర్కారు కబ్జాలకు అడ్డుపడిన టిడిపి నేత ధూళిపాళ్ల నరేంద్రపై కక్ష కట్టాడు సైకో జగన్. తనపై తప్పుడు హత్యాయత్నం కేసు జగన్ నమోదు చేయించగా, హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు నరేంద్ర. బెయిల్ వచ్చేలోపే అక్రమ అరెస్టుకి యత్నించడం జగన్ సైకోయిజానికి పరాకాష్ట. నరేంద్రపై వైసీపీ పెడుతున్న తప్పుడు కేసులు, నిర్బంధాలు, దాడులను తీవ్రంగా ఖండిస్తున్నానని ప్రకటించారు. సంగం డెయిరీ గేట్లు కూలగొట్టేందుకు పోలీసులు జేసీబీల్ని కూడా తీసుకు వచ్చారు. ఈ సంచలనం అయింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసు ఉన్నతాధికారులు స్పందించి.. వెనక్కి వచ్చేయాలని చెప్పడంతో అప్పుడు పోలీసులు వెనక్కి వెళ్లారు. ఆ తర్వాత హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.ఈ నెల 15న ఏలూరు జిల్లాకు చెందిన రామ్మోహన్ అనే వ్యక్తి తనపై సంగం డెయిరీ సిబ్బంది దాడి చేశారంటూ చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు 14 మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అందులో సంగం డెయిరీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పేరు చేర్చడంతో రాజకీయ వివాదానికి దారితీసింది. అయితే పోలీసులు తనపై తప్పుడు కేసు నమోదు చేశారంటూ ధూళిపాళ్ల హైకోర్టును ఆశ్రయించారు. ము?దస్తు బెయిల్ పై విచారణ ఉందని తెలిసి ముందే టీడీపీ నేతలను అరెస్టు చేయాలని ప్రయత్నించడం.. పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అసలు ఘటనా స్థలంలో లేకపోయినా... తప్పుడు కేసులు పెట్టం.. ఇలా అరెస్టు ప్రయత్నం చేయడమేమిటన్న విమర్శలు టీడీపీ నేతలు చేస్తున్నారు.

# భారత ప్రధాని తిరుపతి జిల్లా పర్యటన

**రాష్ట్ర స్థాయి అత్యున్నత సమన్వయ సమావేశంలో సమీక్ష చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**

**భారత ప్రధాని తిరుపతి జిల్లా పర్యటనలో ఏర్పాట్లు పకడ్బందీగా చేపడుతున్నాం జిల్లా కలెక్టర్**

తెలంగాణ వీణ, తిరుపతి : రెండు రోజుల తిరుమల తిరుపతి పర్యటన సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 26 నవంబర్ మరియు 27 తేదీలలో తిరుపతి జిల్లా కు విచ్చేయనున్న నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు చేపడుతున్న ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కే ఎస్ జవహర్ రెడ్డి డిజిపి రాజేంద్ర నాథ్ రెడ్డి తదితర రాష్ట్ర అధికారులతో తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీ టీటీడీ ఈఓ తదితరులతో వర్చువల్ విధానంలో సమన్వయ సమావేశం నిర్వహించి సమీక్షించి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరావతి నుండి వర్చువల్ విధానంలో భారత ప్రధాన మంత్రి గారి తిరుపతి జిల్లా పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించగా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కే వెంకట రమణ రెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, జె.సి డి కె బాలాజీ, జిల్లా రెవెన్యూ అధికారి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ భారత ప్రధాని తిరుపతి ఇంటర్నేషనల్ విమానాశ్రయం దగ్గర దిగినప్పటి నుండి తిరుగు ప్రయాణం వరకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నామని, సంబంధిత అధికారుల సమన్వయ సమావేశం నిన్ననే నిర్వహించి విధులు కేటాయించామని తెలిపారు. ఆరోగ్య శాఖ వారు స్పెషలిస్టు డాక్టర్లు ఏర్పాటు, అధునాతన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్, 108, సేఫ్ రూమ్, తదితరాలు ఏర్పాటు, అలాగే ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ, విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ ఏర్పాటు, తగినంత లైటింగ్ ఏర్పాటు, రవాణా శాఖ వాహనాల ఫిట్నెస్ చెక్, కమ్యూనికేషన్ ప్లాన్ ఇంటర్నెట్ టెలిఫోన్ సదుపాయాలు, శానిటేషన్ ఏర్పాట్లు, అవసరమైన చోట బ్యారికెడిరగ్, రోడ్డు మరమ్మత్తులు చేపట్టడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. భారత ప్రధాని పర్యటన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ రానున్న నేపథ్యంలో వాటికి సంబంధించిన ఏర్పాట్ల కొరకు అధికారులకు విధులు కేటాయించామని అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని తెలిపారు. టీటీడీ ఈఓ మాట్లాడుతూ గౌ. భారత ప్రధాని తిరుమల చేరుకున్నపటి నుండి వారికి వారి సిబ్బందికి, సిఎం, గవర్నర్ గారికి వసతి, ఆహారం, దర్శనం అన్నీ ప్రణాళికా బద్ధంగా చేపడతామని అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ తగినంత బందోబస్తుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.



# సంక్షేమ హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలని` విద్యార్థి యువజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీపుజాత

**హాస్టల్ నిద్ర జయప్రదం చేయాలని పిలుపు..**



తెలంగాణ వీణ, అన్నమయ్య : స్థానిక అన్నమయ్య జిల్లా రాజంపేట లో బీసీ వసతి గృహం నందు విద్యార్థుల తో విద్యార్థి సంఘాల జె.ఏ.సి నాయకులు Iరాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థపక అధ్యక్షులు బందెల ఓబులేసు,డెమొక్రటిక్ స్టూడెంట్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్.రియాజ్, టి.ఆర్.యస్.ఎఫ్ ఉపాధ్యక్షుడు ఇండ్ల జయరాజు,పి.డి.యస్.ఓ రాయలసీమ కన్వీనర్ కత్తి ఓబులేసులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ గిరిజన సంక్షేమ శాఖ మైనార్టీ సంక్షేమ శాఖ కు సంబంధించిన హాస్టల్స్ లలో చదివే విద్యార్థిని విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని సంక్షేమ హాస్టల్స్ లలో కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాలని మౌలిక వసతులను కల్పించాలని నాడు నేడు కింద హాస్టలను నూతన భవనాలతో నిర్మించాలని విద్యార్థులకు మెస్ బిల్లులను కాస్మోటిక్ చార్జీలను ఇవ్వాలని నాణ్యమైన రైసును ఏర్పాటు చేయాలని కొత్తగా ప్రకటించిన మెనూ అమలు చేయాలని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ హాస్టల్ విద్యార్థుల సంఖ్యను పెంచాలని పెరిగిన ధరలు అనుగుణంగా మెస్ పిల్లలు కూడా ఇవ్వాలని ఎనిమిది నెలలు కావస్తున్నా ఇంతవరకు వార్డెన్లకు పెట్టుబడి పెట్టిన మెస్ బిల్లుల బకాయిలను చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందింది వార్డెన్ లో తమ దగ్గర ఉన్న ఆస్తులను వారి జీతాలను ఖర్చు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్న వారికి మెస్ బిల్లులు ఇవ్వకపోవడం చాలా బాధాకరమైన విషయం ఈ విషయాన్ని జీపు జాత ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి చేరవేస్తామని రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయాలను గ్రహించి దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా లక్షల్లో సంక్షేమ శాఖ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించి త్రాగునీరు, మరుగుదొడ్లు ,హాస్టల్స్ రూములను బాగు చేయాలని పాడుబడిన సంవత్సరాల గడిచిన పెచ్చులూడి పడుతున్న భవనాలను మార్చాలని ఈ యాత్ర ద్వారా ఈ ప్రభుత్వాన్ని విద్యార్థి యువజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కోరుతున్నాము ప్రభుత్వం చెల్లించని పక్షాన సంక్షేమ శాఖ అధికారులు పట్టించుకోని పక్షాన జిల్లా కలెక్టర్ చరోచూపుని పక్షాన జిల్లాల వ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తామని వారు అన్నారు ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి హాస్టల్ నిద్ర భాగంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు, యువజన నాయకులు ప్రవీణ్, రాజు ,నవీన్, చంద్ర,నాయక్,ప్రకాష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల టార్చర్ ఎక్కువగా ఉంది

తెలంగాణ వీణ, విజయవాడ : విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిప్రమాదం ఘటనలో మరో కొత్త ట్విస్ట్ వచ్చి చేరింది.. అగ్నిప్రమాదం, బోట్లు తగలబడిపోయిన ఘటనలో పోలీసులు అనుమానితుడిగా భావించిన యూట్యూబర్, లోకల్‌బాయ్ నాని.. హైకోర్టు మెట్లు ఎక్కారు. విశాఖ ఫిషింగ్ హార్బర్ లో బోట్లు కాలిపోయిన ఘటనలో పోలీసులు తనను మూడు రోజుల పాటు అక్రమంగా నిర్బంధించారంటూ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు నాని.. ఈ పిటిషన్‌పై విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది ఏపీ హైకోర్టు. విశాఖ ఫిషింగ్ హార్బర్ ప్రమాదంలో నేను ఏ తప్పూ చేయలేదని స్పష్టం చేశారు నాని.. వేరే ప్లేస్ లో నా స్నేహితులకు పార్టీ ఇచ్చాను.. రాత్రి 11.45 గంటల సమయంలో నాకు బోట్లు తగల బడుతున్నట్టు ఫోన్ వచ్చింది.. దీంతో, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా నేను హార్బర్ కు వెళ్లాను.. నేను వెళ్లే సమయానికి బోట్లు తగల బడుతున్నాయి అని తెలిపాడు.. నేను అప్పటికే మద్యం తాగే ఉన్నాను.. నేను హార్బర్ కు వెళ్లేదంతా సీసీ టీవీ ఫుటేజ్ లో రికార్డ్ అయ్యిందన్నాడు.. అయితే, ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాదాన్ని వీడియో తీయటం ద్వారా ప్రభుత్వానికి విషయం చెప్పటానికి మాత్రమే నేను ప్రయత్నం చేశాను.. కానీ, వీడియోలు తీస్తున్న నన్ను కొందరు కొట్టే ప్రయత్నం చేశారని.. వీడియో తీసిన తర్వాత నేను కూడా సహాయక చర్యల్లో పాల్గొననా తెలిపాడు.. ఆ తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయినట్టు వెల్లడిరచాడు. వీడియో పోస్ట్ చేసిన తర్వాత పోలీసుల నుంచి ఫోన్ వచ్చిందని తెలిపాడు లోకల్ బాయ్ నాని.. పోలీసు విచారణ కోసం రావాలని కోరటంతో వెళ్లానని హైకోర్టు వద్ద మీడియాకు` తెలిపారు. పోలీసులు నేను బోట్లు తగల బెట్టానని నాపై చేయి చేసుకున్నారని ఆరోపిచారు. నేను ప్రమాదం జరిగే సమయంలో హోటల్ లో ఉన్నాను, ఆ హోటల్ లో సీసీ టీవీ ఫుటేజ్ లో నేను ఉన్నాను.. హోటల్‌లోకి ఎప్పుడు వెళ్లింది.. మళ్లీ ఎప్పుడు బయటకు వచ్చింది అన్నీ ఆ ఫుటేజ్‌లో ఉన్నాయని తెలిపాడు.. కానీ, పోలీసులు మూడు రోజుల పాటు నన్ను నిర్బంధించారు. గర్భిణి అయిన నా భార్య ఎంతో ఆందోళనకు గురైంది. ఆమెను కూడా ఇబ్బంది పెట్టారు. నా కుటుంబ సభ్యులకు ఏదైనా జరిగే ప్రమాదం కూడా ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు.. అంతేకాదు.. కోర్టులో పిటిషన్ వేయక పోతే పోలీసులు నన్ను అంతం చేసే వారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబసభ్యులనూ వేధిస్తున్నారని నాని ఆరోపించారు. విశాఖ ఫిషింగ్ హార్బర్ లో అగ్ని ప్రమాద ఘటనలో యూట్యూబర్ లోకల్ బాయ్ నానిని అదుపులోకి తీసుకున్న విశాఖ వన్ టౌన్ పోలీసులు.. అగ్నిప్రమాదంపై ఆరా తీశారు.. ఈ అగ్నిప్రమాదానికి నానియే కారణం అంటూ జోరుగా ప్రచారం జరిగింది. దీంతో, అతడిని మూడు రోజుల పాటు పోలీసుల అదుపులోనే ఉన్నాడు.. అయితే, నానిని అక్రమంగా పోలీసులు బంధించారని అతని స్నేహితులు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ తర్వాత పోలీసులు నానిని రిలీజ్ చేశారు.. తనను అక్రమంగా నిర్బంధించారని పిటిషన్ దాఖలు చేయడంతో.. విశాఖ పోలీసులకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి.

# ఫిషింగ్ హార్బర్ కేసులో దొరకని ఆచూకీ

తెలంగాణ వీణ, విశాఖపట్టణం : విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిప్రమాదంలో బోట్లు దగ్ధమైన ఘటనలో పోలీసులకు ఎటువంటి క్లూస్ లభించ లేదు. ప్రస్తుతం వాసుపల్లి నాని, అల్లిపిల్లి సత్యం అనే ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వాసుపల్లి నాని ఫిషింగ్ హార్బర్ లో కొన్ని బోట్లకు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సత్యం అక్కడ వంటచేసే వాడిగా చెబుతున్నారు. సత్యం వంట చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదం జరిగి ఉండే అవకాశం లేకపోలేదన్న కోణంలోనూ విచారణ జరుగుతున్నట్టు సమాచారం అందుతోంది. కాగా ఈ ప్రమాదంలో తొలుత అభియోగాలు ఎదుర్కొన్న లోకల్ బాయ్ నానిని గురువారం సాయంత్రం వదిలేశారు పోలీసులు. విడుదల అనంతరం బీజేపీ ఎంపీ జీవీఎల్‌ను కలిసి తను తప్పు చేయలేదంటూ అవేదన వ్యక్తం చేశాడు నాని. నానిపై ఆధారాలు లేకుంటే ఎందుకు ఇల్లీగల్ కస్టడీలో ఉంచుకున్నారంటూ పోలీసులను ప్రశ్నించారు జీవీఎల్.మరోవైపు ఏపి హైకోర్టులో గురువారంహెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు యూట్యూబర్ నాని కుటుంబ సభ్యులు. అగ్ని ప్రమాదం ఘటనపై ప్రమేయం లేనప్పటికీ.. నానిని పోలీసులు అదుపులో ఉంచుకున్నారంటూ.. కోర్టులో పిటిషన్ వేయడంతో.. అలెర్టయిన పోలీసులు.. నానిని విడుదల చేశారు. అయితే తన పరువుకు నష్టం కలిగించేలా పోలీసులు వ్యవహరించాని.. 20 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు నాని.యూట్యూబ్‌లో లోకల్ బాయ్ నానిగా గుర్తింపు పొందాడు నాని. సముద్రంపై వేటకు వెళ్లి.. వలకు పడిన చేపల దృశ్యాలను.. యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తాడు. ప్రమాదం జరిగిన వెంటనే లోకల్ బాయ్ నాని ఈ ప్రమాద దృశ్యాలను షూట్ చేసి తన యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేశాడు. అసలు ఈ ప్రమాదం ఎలా జరిగిందో, ఎవరు కారకులో తెలియడం లేదని నాని ఆ వీడియోలో చెప్పాడు. అయితే ప్రమాద సమయంలో తాను అక్కడ లేనని నాని చెబుతున్నాడు.''ఫిషింగ్ హార్బర్ ఘటనలో నా తప్పు లేదు. ఘటన జరిగిన సమయంలో నేను అక్కడ లేను. రాత్రి 11 తర్వాత ప్రమాదంపై సమాచారం అందింది. ఫోన్ వచ్చిన వెంటనే బయల్దేరి వెళ్లాను. ప్రమాదంపై ప్రభుత్వానికి సమాచారం అందించేందుకే.. ఘటన జరుగుతున్నపుడు నేను వీడియో తీశాను. వీడియో తీసిన తర్వాత సహాయక చర్యల్లో పాల్గొన్నాను'' అని నాని తెలిపాడు.హార్బర్ ప్రమాదంపై రెవెన్యూ, ఫైర్ సర్వీస్, ఫిషరీస్, ఫోరెన్సిక్, పోలీస్ అధికారుల కమిటీ విచారణ చేస్తుంది. ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంగా ఈఎఫ్ఐ నమోదు చేశారు వన్ టౌన్ పోలీసులు. అటు అనుమానిత యువకులను ప్రశ్నిస్తున్నారు. టెక్నికల్ డేటా ఏనాలాసిస్ చేస్తున్న పోలీసులు, డంప్ కాల్స్ పై దృష్టి పెట్టారు.. ఘటన జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న వారి వివరాలు సేకరించే పనిలో ఉన్నారు పోలీసులు. ప్రమాదంపై లోతుగా విచారిస్తున్నారు లీసులు.మరోవైపు ఈ సంఘటనతో?.విశాఖ ఫిషింగ్ హార్బర్ సెక్యూరిటీలో డొల్లతనం బయటపడిరది. సీసీ కెమెరాలు పనిచేయట్లేదని పోలీసులు గుర్తించారు. భద్రతా లోపాల గురించి ఎన్నిసార్లు మొత్తుకున్నా అధికారులు పట్టించుకోవట్లేదని మత్స్యకార సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సెక్యూరిటీని పెంచాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదంటూ మత్స్యకారులు వాపోతున్నారు. హార్బర్‌లో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేస్తే పరిస్థితి మెరుగ్గా ఉంటుందని చెప్పినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఫిషింగ్ హార్బర్‌లోకి ఎవరు వస్తున్నారో, ఎవరు వెళ్తున్నారో తెలియదంటున్నారు వాళ్లు.

### గ్యాస్ సిలిండర్ లీకై

### ఒకే కుటుంబానికి నలుగురు

## తీవ్రంగా గాయాలు



తెలంగాణ వీణ, విశాఖ పట్టణం : విశాఖ జిల్లా కేంద్రంలో గ్యాస్ సిలిండర్ లీకై ఒకే కుటుంబానికి నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. జిల్లా కేంద్రంలోని మధురవాడ వాంబే కాలనీలో నివాసముంటున్న బాలరాజు అనే వ్యక్తి అయ్యప్పమాల ధరించాడు. శుక్రవారం వంట గ్యాస్ అయిపోవడంతో కొత్త సిలిండర్‌కు రెగ్యులేటర్‌ను అమర్చాడు. అయితే రెగ్యులేటర్‌ను సక్రమంగా అమర్చలేదు.గ్యాస్ లీకేజీ అయిన విషయం గమనించకుండా కొద్ది సేపు అనంతరం దేవుడి చిత్రపటాల వద్ద దీపారాధన చేయడానికి అగ్గి వెలిగించడంతో ఒక్కసారిగా ఇంట్లో మంటలు వ్యాపించాయి. దీంతో బాలరాజుతో పాటు భార్య చిన్ని, కుమారులు గిరి, కార్తిక్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ నలుగురిని 108 అంబ్‌లెన్స్‌లో కింగ్ జార్జ ఆసుపత్రికి తరలించారు.

# టీటీడీపీ ఛీఫ్ ఎవరు..?

తెలంగాణ వీణ, హైదరాబాద్ : తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ రాజీనామా చేసి బీఆర్ఎస్ లో చేరిపోయారు. ఇప్పుడు తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు లేరు. తదుపరి ఎవరికి చాన్సిస్తారన్నదానిపై టీడీపీలో చర్చలు జరుగుతున్నాయి. అయితే ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్నందున కొత్త అధ్యక్షుడి నియామకంపై చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం లేదని చెబుతున్నారు. తెలంగాణ ఎన్నికలు పూర్తయిన తర్వాత రాజకీయాల్ని బట్టి తదుపరి కార్యాచరణ ఖరారు చేసుకునే అవకాశం ఉంది. అయితే పార్టీ అధ్యక్ష పదవి కోసం గట్టిగా ప్రయత్నిస్తున్న ఆశావహులు చాలా మంది ఉన్నారు .తెలంగాణ టీడీపీ నుంచి చాలా మంది నేతలు వెళ్లిపోయారు. సీనియర్లు అందరూ ఎవరి దారి వారు చూసుకున్నారు. కానీ పార్టీని అంటి పెట్టుకుని ఇంకా చాలా మంది నేతలు ఉన్నాయి. వారిలో అరవింద్ కుమార్ గౌడ్ కీలకంగా ఉంటున్నారు. ఈ సారి ఆయన తనకు పార్టీ అధ్యక్ష పదవి ఇస్తారని ఆశిస్తున్నారు. గతంలో వివిధ సమీకరణాలతో అరవింద్ కుమార్ గౌడ్ కు అవకాశాలు లభించలేదు. టీడీపీ మాజీ నేత దేవేందర్ గౌడ్ కు దగ్గర బంధువు అయిన అరవింద్ కుమార్ గౌడ్.. పార్టీలో తనకు అవకాశాలు వచ్చినా రాకపోయినా పార్టీ కోసం కష్టపడుతున్నారు. అలాగే నన్నూరి నర్సిరెడ్డి, తిరునగరి జ్యోష్ణ లాంటి నేతుల కూడా కష్టపడుతున్నారు. ఇటీవల కాట్రగడ్డ ప్రసూన కూడా యాక్టివ్ గా మారారు. వీరందరితోపాటు మరికొంత మంది నేతల పేర్లను చంద్రబాబు పరిశీలించే అవకాశం ఉంది. తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. కానీ టీడీపీ మద్దతు కోసం అన్ని పార్టీలు ప్రయత్నిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ క్యాడర్ .. టీడీపీ సానుభూతి పరుల ఓట్లు తమకే దక్కుతాయని ఆ పార్టీ జెండాలను పట్టుకుని మరీ పలు చోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు టీడీపీ జెండాలతో ప్రచారం చేసుకుంటున్నారు. ఆ పార్టీ నేతలు తమ నియోజకవర్గాల్లో ఉంటే.. వారిని తమ ప్రచారంలో తిప్పుకుంటున్నారు. వీటన్నింటినీ చూస్తే తెలుగుదేశం పార్టీకి మంచి ఆదరణ ఉంటుందని ఆ పార్టీ నేతలు అంచనాకు వస్తున్నారు. చంద్రబాబు అరెస్టు తర్వాత ఆయనకు తెలంగాణలో వివిధ ప్రాంతాల్లో వచ్చిన మద్దతు కూడా టీడీపీ బలానికి సూచికగా బావిస్తున్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ సానుభూతిపరులు ఫలానా పార్టీకి లేదా కూటమికి మద్దతుగా ఓటు వేయాలని చంద్రబాబు పిలుపునిచ్చే అవకాశం లేదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. అయితే వారు ఏ పార్టీకి అయినా ఓటు వేసుకోవచ్చని.. మద్దతు ఇవ్వవొచ్చన్న సంకేతాలు మాత్రం పంపారు. ఇతర పార్టీలు తమకు టీడీపీ మద్దతు ఉందని ప్రకటించుకుంటున్నా.. ఆయా పార్టీల ర్యాలీల్లో పాల్గొంటున్నా వద్దని చెప్పడం లేదు. దీంతో ఆత్మప్రబోధానుసారం ఓట్లు వేయవచ్చని చెప్పినట్లయిందని అంటున్నారు. తెలంగాణ టీడీపీ అధ్యక్షుడి ఎంపిక తర్వాత .. తదుపరి అసలు రాజకీయాన్ని ప్రారంభించే అవకాశం ఉంది.

# కేవీపికి ఘన స్వాగతం



తెలంగాణ వీణ, విశాఖపట్నం : చేరుకున్న కాంగ్రెస్ మాజీ రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు, అక్కినేని నాగార్జున,అఖిల్ అక్కినేని శుక్రవారం నాడు హైదరాబాద్ నుండి ప్రత్యేక విమానంలో విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు.వారికి పిసిసి కార్యవర్గం మహిళలు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మైనారిటీ నాయకులు విశాఖ జిల్లా అధ్యక్షులు గొంప గోవిందరాజు ఘన స్వాగతం పలికారు. విశాఖ ఎయిర్ పోర్ట్ నుండి రోడ్డు మార్గాన నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి కెవిపి రామచంద్ర రావు వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తరువాత రంమధ్యాహ్నం తెలుగు భాషా సంఘం చైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పుట్టినరోజు వేడుకల్లో కెవిపి రామచందర్రావు నాగార్జున, అఖిల్ పాల్గొన్నారు.



# భారతీయ నేవీ అధికారుల మరణ శిక్షపై భారత సర్కార్ సవాల్

**పిటీషన్‌ను విచారణకు అంగీకరించిన ఖతార్ కోర్టు**

తెలంగాణ వీణ, న్యూఢల్లీ : భారతీయ నేవీకి చెందిన 8 మందికి ఖతార్ కోర్టు మరణ శిక్ష విధించిన విషయం తెలిసిందే. ఆ శిక్షను సవాల్ చేస్తూ భారత సర్కార్ దాఖలు చేసిన పిటీషన్‌ను ఖతార్ కోర్టు విచారణకు అంగీకరించింది.అయితే త్వరలోనే ఆ కేసు విచారణ తేదీని కోర్టు ప్రకటించనున్నది. గూఢచర్యం కింద ఖతార్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ఆగస్టు 2022లో 8 మందిని అరెస్టు చేసింది. కానీ ఖతార్ ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు ఎటువంటి ఆరోపణలు చేయలేదు. అనేక సార్లు బెయిల్ పిటీషన్‌ను పెట్టుకున్నా.. ఖతార్ సర్కార్ వాటిని తిరస్కరించింది. అరెస్టు అయినవారిలో కమాండర్ పూర్ణేందు తివారి, కమాండర్ సుగుణాకర్పాకాల, కమాండర్ అమిత్ నాగ్‌పాల్, కమాండర్ సంజీవ్ గుప్తా, కెప్టెన్ నవతేజ్ సింగ్ గిల్, కెప్టెన్ బీరేంద్ర కుమార్ వర్మ, కెప్టెన్ సురభ్ వాసిత్, సెయిలర్ రాగేశ్ గోపాకుమార్ ఉన్నారు. అరెస్టు అయిన నేవీఆఫీసర్లు అందరూ దాదాపు 20 ఏళ్ల పాటు సర్వీస్‌లో ఉన్నారు.




# బీసీ బిడ్డగా ఎదిగితే అంతం చేయాలని చూస్తుండ్రు

**గరీబని అందలం ఎక్కిస్తే నాపైనే దుష్ప్రచారం చేస్తుండ్లు**
**మీ బిడ్డల భవిష్యత్ గురించి ప్రతి ఒక్కరు ఆలోచించాలే**
**ఆదరించి ఆశీర్వదిస్తే ఐదేండ్లు సేవకుడిగా పనిచేస్తా**
**బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్**



తెలంగాణ వీణ, మంథని : మీ కళ్ల ముందే బీసీ బిడ్డగా ఎదిగితే కాంగ్రెస్సోళ్లకు అడ్డుగా ఉన్నానని అంతం చేయాలని చూస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బాగంగా శుక్రవారం రామగిరి మండలం రామయ్యపల్లి, రాజాపూర్,ఆదివారంపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనీఫెస్టో, ప్రభుత్వ పథకాలు, సేవలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో జన్మించి మీ అందరి ఆశీస్సులతో ఈ స్థాయికి ఎదిగి మీ తమ్ముడిలా అన్నలా కొడుకులా పనిచేస్తుంటే అబద్దాలు అసత్య ప్రచారాలతో దూరం చేయాలని చూస్తున్నారని ఆయన అన్నారు. 15ఏండ్లుగా తనపై తప్పులు ఆరోపణలు, అబండాలు వేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇప్పటి వరకు కాంగ్రెస్సోళ్లు చేసిన ఏ ఒక్క ఆరోపణను నిరూపించలేదన్నారు. మీ సమస్యలను నా సమస్యలుగా బావించి ఎమ్మెల్యేగా ఓడిపోయినా ప్రజలకు సేవలు అందించానే తప్ప ఎలాంటి తప్పు చేయలేదన్నారు. రామగిరి మండలానికి చెందిన గరీబు బిడ్డ అని గౌరవంగా బతుకాలని అందలం ఎక్కిస్తే ఈనాడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పంచనచేరి తనపైనే బురదజల్లుతున్నారని అన్నారు. ఒక ప్రజాప్రతినిధిగా తోటి ప్రజాప్రతినిధులతో మంచిగా ఉండాలని చెప్పితే తమను తిట్టారని, బెదరించారంటూ మీడియా ముందుకు వచ్చి అనేక సాక్ష్యాలున్నాయని చెప్పారని, ఈనాటికి ఆ సాక్ష్యాలు ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు. సదరు ప్రజాప్రతినిధి చెక్కులపై సంతకాలు పెట్టినవి, వికలాంగుడి భూమి లాక్కున్న రికార్డులు తమ వద్ద ఉన్నాయని ఆయన వివరించారు. ఈనాడు మన బీసీ ఎస్సీ ఎస్టీలను అక్కున చేర్చుకుని మనపైనే ఎమ్మెల్యే అభ్యర్థి దాడులు చేయిస్తున్నాడని అన్నారు. ఎక్కడ గొడవ జరిగినా తననే టార్గెట్ చేస్తున్నారని, నామిదనే కేసులు పెట్టిస్తున్నాడని ఆయన అన్నారు. ఓడేడ్ గ్రామానికి చెందిన సర్పంచ్ మీనాజీపేటకు పోయి అక్కడి మాజీ జెడ్పీటీసీపై దాడి చేసి ఆ ఘటనలో తనను బాధ్యుడిని చేసి కేసు పెట్టారని, అంతేకాకుండా సదరు సర్పంచ్ ఒరే పుట్ట మధూ నీ అంతుచూస్తా...కాంగ్రెస్ కార్యకర్తలంతా బీఆర్ఎస్ నాయకుల ఇండ్లపై దాడులు చేయండి అంటూ నినాదాలు చేసిన తీరుపై ప్రజలు ఆలోచన చేయాలన్నారు. మాజీ నక్సలైట్లు, రౌడీయిజం చేసేవాళ్లు, స్మగ్లర్లను కాంగ్రెస్‌పార్టీలో చేర్చుకున్న కాంగ్రెస్ అభ్యర్థి తనను ఖతం చేయాలని కుట్రలు చేస్తున్నాడని అన్నారు. తన అడ్డు తొలగించుకుంటే ఇక హైదరాబాద్‌లో ఉండే పాలన చేయవచ్చని బావిస్తున్నాడని అన్నారు. ఎన్నికల రాంగానే ఏం జరుగుతుందో ఆలోచన చేయకపోవడం మూలంగా పెద్ద ప్రమాదం పొంచి ఉందని, ప్రజలు, యువకులు ఆలోచన చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మనం ఆలోచన చేయకపోవడంతోనే మోసం చేసిన వాళ్లే మళ్లీ మోసం చేసేందుకు వస్తున్నారని అన్నారు. ఐదేండ్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే కాంగ్రెస్ఎమ్మెల్యే అభ్యర్థి ఏం చేయకుండా మళ్లీ ఓట్ల కోసం వస్తున్నాడని, ఈనాడు ఓట్లకు వస్తే ఏం చేశావని అడుగాలని అన్నారు. తనకు నాలుగేండ్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే ఎంతో అభివృద్ధి చేశానని, ఎంతో మంది పేద బిడ్డల పెండ్లిళ్ళు, కేసీఆర్ పథకాలను అమలు చేశానని, అభివృద్ధి, సేవలు మీ కళ్ల ముందే సాక్ష్యాలుగా ఉన్నాయన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు తాను ఓట్లతో సంబంధం లేకుండా పనిచేశానని, గత ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజలను కుటుంబసభ్యులుగా బావించి తనవంతు సాయం చేశానన్నారు. బీసీ బిడ్డగా ఎదిగిన తనను ఖతం చేస్తే మళ్లీ ఇంకా ఎవరు పైకి వస్తారని ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలు వస్తే పైసలు, గడియారాలు, చీరలు పంచి అధికారంలోకి రావచ్చనే ఆలోచన తప్ప ఓట్లు వేసిన ప్రజలకు సాయం చేయాలనే ఆలోచన కాంగ్రెస్ అభ్యర్థికి లేదన్నారు. ఐదేండ్లు అవకాశం ఇస్తే కనీసం చెంచెడు నీళ్లు పోసిండా, ఓ ఆడబిడ్డ పెండ్లికి పుస్తె మట్టెలు, పేద విద్యార్థి చదువుకు సాయం చేసిండా అని ఆయన ప్రశ్నించారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏం చేయలేదని, ఈనాడు ఎమ్మెల్యేగా ఉండి కూడా ఏమీ చేయలేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వ పథకాలు, నా సేవలు ముందుకు సాగాలంటే తనను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని, మళ్లీ అధికారంలోకి రాంగానే వాటితో పాటు రైతుబీమా తరహాలో కేసీఆర్ బీమా, సౌభాగ్యలక్ష్మి పేరిట ప్రతి గృహిణికి ఇంటి అవసరాల కోసం రూ.3వేలు, రైతుబంధు పెట్టుబడ సాయం, ఆసరా పెంచన్‌ల పెంపులతో పాటు గొప్ప పథకాలు అమలు అవుతాయన్నారు. ఈ పథకాలతో పాటు తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే పేదింటి ఆడబిడ్డలకు పెండ్లి, హైదరాబాద్‌లో చదువుకునే విద్యార్థులకు హస్టల్ వసతి కల్పించి రూపాయి ఖర్చు లేకుండా చదవిస్తానని, గృహలక్ష్మి పథకం ద్వారా ఇల్లు లేని ప్రతి ఒక్కరికి మూడు లక్షలతో పాటు తాను కొంత సాయం అందించి ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. మీ బిడ్డల భవిష్యత్ బాగు కోసం ఆలోచన చేయాలని, ఎమ్మెల్యేగా ఆదరించి ఆశీర్వదిస్తే ఐదేండ్లు మీ సేవకుడిగా పనిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# 27 నుంచి 3 వరకు కులగణన..

విజయవాడ, తెలంగాణ వీణ: ఏపీలో ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఎలక్షన్ ఫీవర్ నెలకొంటోంది. వైసీపీ సర్కార్ కు మరో నాలుగు నెలల వ్యవధి మాత్రమే ఉంది. అందుకే కీలక నిర్ణయాలు దిశగా జగన్ సర్కార్ అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఏపీలో కుల గణన ప్రక్రియ ప్రారంభమైంది. దీనిని మరింత వేగవంతంగా పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా కుల గణనకు సంబంధించి సచివాలయాలకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి.రాష్ట్ర వ్యాప్తంగా కుల గణనను వారం రోజుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పైలెట్ ప్రాజెక్టు కింద వేర్వేరు చోట్ల కుల గణన చేపట్టారు. ఈనెల 27 నుంచి డిసెంబర్ 3 వరకు వారం రోజుల పాటు ప్రతి ఇంటిని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు జల్లెడ పట్టనున్నారు. మొత్తం 20 అంశాలకు సంబంధించి వివరాలు సేకరించనున్నారు. ఒకవేళ ఎవరైనా అందుబాటులో లేకపోతే.. గణన పూర్తయిన తర్వాత.. మరో వారం రోజులు పాటు ఇటువంటి వారి కోసం సమయాన్ని కేటాయించనున్నారు. అయితే నేరుగా ఆ కుటుంబ సభ్యుల సచివాలయాలకు వెళ్లి వివరాలు అందించాల్సి ఉంటుంది.ఈ కుల గణనకు సంబంధించి ప్రత్యేకమైన మొబైల్ యాప్ ను రూపొందించారు. వివరాలు సేకరించేటప్పుడు, ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత స్క్రీన్ షాట్ కానీ, వీడియో రికార్డింగ్ చేసేందుకు వీలు లేకుండా ప్రత్యేక యాప్ ను రూపొందించారు. సర్వేలో భాగంగా చిరునామా, కుటుంబసభ్యుల సంఖ్య, వివాహ వివరాలు, కులం, ఉప కులం, మతం, రేషన్ కార్డు నెంబర్, విద్యార్హత, ఇంటి వివరాలు, వంట గ్యాస్ తో పాటుగా ఉపాధికి సంబంధించిన వివరాలు సేకరించనున్నారు.ఈ కులగణన ప్రక్రియతో రాజకీయ లబ్ధి చేకూరుతుందని వైసీపీ సర్కార్ ఆశిస్తోంది. ఇప్పటికే బీసీ కులాల జాబితా విషయంలో కొన్ని సామాజిక వర్గాలకు ఉపశమనం కలిగిస్తూ జగన్ సర్కార్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఏకంగా కుల గణన ప్రక్రియ చేపడుతుండడం విశేషం. అయితే పూర్తిస్థాయి మ్యానువల్ విధానంలో చేయాల్సి ఉన్న గణన.. మొబైల్ యాప్ లో రూపొందిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. దీని ద్వారా సక్రమమైన సమాచారం అందుతుందా? లేదా? అన్న అనుమానాలు ఉన్నాయి. అదే సమయంలో వలంటీర్లకు భాగస్వామ్యం చేయడంతో పక్కదారి పడుతుందా? అన్న విమర్శలు వస్తున్నాయి. అయితే గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కుల గణనకు జగన్ సర్కార్ ముందుకు రావడం విశేషమే.

**సక్సెస్ అయిన పైలెట్ ప్రాజెక్ట్**

ఏపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న కుల గణనను వారం రోజుల్లోనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నవంబర్ 27 నుంచి డిసెంబర్ 3లోగా సర్వే పూర్తి చేయాలని గ్రామ,వార్డు సచివాలయాలకు మార్గదర్శకాలు అందాయి. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో 3 గ్రామ సచివాలయాలు, 2 వార్డు సచివాలయాల పరిధిలో సర్వే నిర్వహించారు. ఇవి విజయవంతం కావడంతో ఈ నెల 27 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది.డిసెంబరు 3 నాటికి సర్వే పూర్తి చేయాని, సర్వేలో వాలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 20కి పైగా అంశాలపై సమాచారం సేకరించనున్నారు. సర్వే కోసం వాలంటీర్లు ఇళ్లకు వచ్చిన సమయంలో ఇంటికి తాళం వేసి ఉన్నా.. కుటుంబ సభ్యులు ఇళ్ల దగ్గర లేకపోయినా వారి వివరా ల నమోదు కోసం సర్వే పూర్తయిన వివరాల నమోదుకు తరువాత మరో వారం గడువు ఇవ్వనున్నారు. ఆ సమ యంలో సంబంధిత కుటుంబసభ్యులే సచివాలయాలకు వెళ్లి వివరాలు అందించాలి.కుల గణన సర్వే వివరాల నమోదుకు వాలంటీర్ల సెల్‌ఫోన్లలో ప్రత్యేక యాప్ ఇన్‌స్టాల్ చేస్తున్నారు. సర్వే ప్రారంభం నుంచి ముగింపు వరకు వాలంటీర్లు ఒకే ఫోన్ వినియోగించాల్సి ఉంటుంది. సర్వేలో భాగంగా కుటుంబాల నుం చి వివరాలు సేకరించేటప్పుడు, సర్వే పూర్తి అయిన తరువాత స్క్రీన్ షాట్ తీయకుండా యాప్‌లో డిజైన్ చేశారు.సమగ్ర కులగణన సర్వేలో భాగంగా ప్రతి ఒక్కరి వివరాలు సేకరిస్తారు. వ్యక్తిగత చిరునామా, కు టుంబ సభ్యుల సంఖ్య, వివాహం జరిగిందా, లేదా, 'కు లం, ఉపకులం, మతం, రేషన్ కార్డు నంబరు, విద్యార్హత, ఇంటి రకం, నివాస స్థల విస్తీర్ణం, వ్యవసాయ భూమి విస్తీర్ణం, మరుగుదొడ్డి రకం, వంట గ్యాస్, తాగునీటి సదుపాయం ఉందా వంటి వివరాలను నమోదు చేస్తారు.ఇంట్లో ఉన్న పశువుల సంఖ్య తదితర వివ రాలను సేకరిస్తారు.ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటినే శాశ్వత చిరునామాగా పరిగణిస్తారు. కుటుంబంలో ఎవరైనా వ్యక్తి చనిపోతే అదే కుటుంబంలోని మరొకరు దాన్ని ధ్రువీకరిస్తూ వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే కులగణనకు సిద్ధంగా ఉండాలని గ్రామ, వార్డు సచివాలయ శాఖ అడిషనల్ డైరెక్టర్ ధ్యానచంద్ర అధికారులకు సూచించారు.ఇప్పటికే శ్రీకాకుళం, డా. అంబేద్కర్ కోనసీమ, ఎన్టీఆర్, పొట్టిశ్రీ రాములు నెల్లూరు, వైయస్ఆర్ జిల్లాల్లో ఎంపిక చేసిన సచివాలయాల్లో జరుగుతున్న 'కులగణన ప్రయోగాత్మక సర్వే'ను సమీక్షించారు. ప్రాథమికంగా ఎదురైన సమస్యల పరిష్కారంపై అధికారులతో చర్చిం చారు. సర్వే కోసం రూపొందించిన యాప్‌లో కొన్ని మార్పులు, చేర్పులు చేయాలని సూచనలు చేశారు. ఈ 'కేవైసీ నమోదులో ప్రజలకు ఇబ్బంది కలగకుండా వారి గుర్తింపు కోసం ఫేషియల్, ఓటీపీ, వేలిముద్ర తదితర సౌకర్యాలు కల్పించారు

# హుజూరాబాద్ లో ట్రైయాంగిల్ ఫైట్

తెలంగాణ వీణ, కరీంనగర్, : తెలంగాణలో కీలకమైన మరో నియోజకవర్గం హుజూరాబాద్. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే, బీజేపీ ఎలక్షన్ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సొంత నియోజకవర్గం ఇది. ఇక్కడి నుంచి ఈటల రాజేందర్ ఇప్పట ఇరకు ఏడుసార్లు విజయం సాధించారు. ప్రతీసారి తిరుగులేని మెజారిటీ సాధిస్తూ.. హుజూరాబాద్ గడ్డ.. ఈటల అడ్డా అన్నట్లుగా మార్చేశారు. కానీ, మూడు దశాబ్దాల తర్వాత ఇక్కడ ఈటల గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. బీజేపీ తరఫున హుజూరాబాగ్, గజ్వేల్ నుంచి పోటీ చేస్తున్న ఈటల రాజేందర్ ఈసారి రెండుచోట్ల గెలుస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కానీ గ్రౌండ్ రిపోర్ట్ ఇందుకు విరుద్ధంగా ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. స్థానిక ఓటర్లు ఈసారి మార్పు కోరుకుంటున్నారు. మరోవైపు ఈసారి ఇక్కడి నుంచి బరిలో దిగిన కాంగ్రెస్ అభ్యర్థి భారీగా ప్రభుత్వ వ్యతిరే ఓట్లను చీలుస్తారని తెలుస్తోంది. దీంతో ఈసారి ఈటల గెలుపు అంత ఈజీ కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్‌ను ఓడిరచేందుకు పాడి కౌశిక్‌రెడ్డి అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు కాంగ్రెస్ టికెట్‌పై ఈటలతో తలపడ్డారు. కానీ రెండుసార్లు ఓడిపోయారు. ఈసారి బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేస్తున్నారు. ఈసారి ఎలాగైనా ఈటలను ఓడిరచాలని సర్వశకక్తులు ఒడ్డుతున్నారు. చివరకు తన భార్య, బిడ్డను కూడా ప్రచారంలోకి దించాడు. కౌశిక్‌రెడ్డి భార్య అయితే ఏకంగా కొంగుచాపి తన భర్తకు ఒక్క ఛాన్స్ ఇవ్వాలని అర్థిస్తోంది. ఇక కౌశిక్‌రెడ్డి 12 ఏళ్ల కూతురు కూడా తండ్రిని గెలిపించాలని ప్రచార సభల్లో ప్రసంగిస్తోంది. మా నాన్నను గెలిపిస్తే హుజూరాబాద్‌ను హైదరాబాద్‌లా మారుస్తాడని చెబుతోంది. అదే విధంగా రామక్క పాటకు రీల్స్ చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం నిర్వహిస్తోంది. దీంతో ఈసారి కౌశిక్‌కు సానుభూతి ఓట్లు పడతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఇక ఈసారి కాంగ్రెస్ కూడా బలమైన అభ్యర్థిని హుజూరాబాద్ బరిలో దించింది. ఉప ఎన్నికల్లో బల్మూరి వెంకట్‌ను ఈటలపూ పోటీ చేయించింది. కానీ డిపాజిట్ కూడా రాలేదు. దీంతో ఈసారి ఒడితెల ప్రణవ్. టీఆర్ఎస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన కెప్టెన్ లక్ష్మీకాంతరావు మనుమడు ప్రణవ్. నియోజకవర్గ పునర్విభజనకు ముందు హుస్నాబాద్, హుజూరాబాద్ కమలాపూర్ నియోజకవర్గంలో ఉండేవి. కమలాపూర్‌లో కెప్టెన్‌కు మంచి పట్టు ఉంది. దీంతో ఈసారి కాంగ్రెస్ పార్టీ కెప్టెన్ మనుమడిని హుజూరాబాద్ బరిలో నిలిపింది. దీంతో భారీగా ఓట్లు చీలుస్తాడని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రణవ్ కూడా బీఆర్ఎస్, బీజేపీకి దీటుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోతో గెలుపుపై ధీమాతో ఉన్నారు.ఒకవైపు కౌశిక్‌రెడ్డి, మరోవైపు ఒడితెల ప్రణవ్.. ఈసారి హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్‌కు గట్టి పోటీ ఇస్తున్నారు. మరోవైపు ఈటల ఈసారి హుజూరాబాద్ కంటే.. గజ్వేల్‌పైనే ఎక్కువ దృష్టిపెట్టారు. ఇక్కడ ఆయన సతీమణి జమునారెడ్డి ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే బీజేపీ అధికారంలోకి వస్తే ఈటల ముఖ్యమంత్రి అవుతాడన్న ప్రచారం హుజూరాబాద్‌లో విస్తృతంగా జరుగుతోంది. అదొక్కటే ఈటలకు పాజిటివ్. ఇక ప్రణవ్ ఓట్లను చీలుస్తారని భావిస్తుండడంతో అటు బీఆర్ఎస్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డి, ఇటు బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ టెన్షన్ పడుతున్నారు. ప్రణవ్ ఎవరి ఓట్లు చీలుస్తాడో అన్న ఆందోళన రెండు పార్టీల్లో కనిపిస్తోంది.

# చైనా హెచ్9ఎన్2 వైరస్ వల్ల భారత్‌కు ఎటువంటి రిస్క్ లేదు

**స్పష్టం చేసిన భారత ప్రభుత్వం**

తెలంగాణ వీణ, న్యూఢల్లీ : చైనాలో ప్రస్తుతం హెచ్9ఎన్2 వైరస్ కేసులు ప్రబలుతున్న నేపద్యం లో శుక్రవారం భారత ప్రభుత్వం ప్రకటన చేసింది. చైనాలో ఉన్న హెచ్9ఎన్1 కేసులతో భారత్‌కు ఎటువంటి రిస్క్ లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏవియన్ ఇన్ఫ్లుయాంజా కేసులతో పాటు, శ్వాసకోస వ్యాధుల సంఖ్య చైనాలో పెరుగుతున్నాయి. చిన్నారుల్లోనే ఈ లక్షణాలు అధికంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత సర్కారు ప్రకటన చేయాల్సి వచ్చింది. ఎటువంటి సమస్యనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉన్నట్లు ఆరోగ్యశాఖ వెల్లడిరచింది.పిల్లల్లో నమోదు అవుతున్న నుమోనియా కేసులకు కొత్త తరహా ప్యాథోజన్‌తో లింకు లేదని చైనా వెల్లడిరచినట్లు డబ్ల్యూహెచ్‌వో ఓ మీడియా సమావేశంలో పేర్కొన్నది. అక్టోబర్ నుంచి చైనా పిల్లల్లో శ్వాసకోశ వ్యాధులు నమోదు అవుతున్నట్లు డేటా ప్రకారం తెలుస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. అయితే వ్యాధులకు సంబంధించిన మరింత డేటాను ఇవ్వాలని చైనాను కోరినట్లు డబ్ల్యూహెచ్‌వో పేర్కొన్నది. బీజింగ్‌లో కానీ, లియానింగ్‌లో కానీ ఎటువంటి కొత్త ప్యాథోజెన్స్‌ను గుర్తించ లేదని, అయితే పిల్లల్లో నుమోనియా కేసులు పెరగడానికి సాధారణ ప్యాథోజెన్లే కారణమని డబ్ల్యూహెచ్‌వో చెప్పింది.



## మల్కాజిగిరిలో మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రచారం



తెలంగాణవీణ, మల్కాజిగిరి ; మల్కాజ్గిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. నియోజకర్గంలోని పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ బీఆర్ఎస్ ను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ఈస్ట్ ఆనంద్ ప్రసాద్ పరిధిలో దుర్గా నగర్, దొడ్ల బస్తి వద్ద రానున్న ఎన్నికల్లో తన అభ్యర్థిత్వానికి మద్దతు కోరుతూ ఇంటింటీ ప్రచారం నిర్విహించారు. ఈ సందర్భంగా కాలనీల్లోని మహిళలు మంగళనీరాజనాలతో ఘన స్వాగతం పలికారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తొందని, గులాబీజెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు మురుగేష్, చిన్నా యాదవ్, నాగ కుమారి తదితరులు పాల్గొన్నారు.

**గౌతంనగర్ లో..**

మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల కష్టాలు తీరాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ రాజశేఖర్ రెడ్డి సతీమణి మర్రి మమతారెడ్డి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్, ఈస్ట్ ఇందిరాల నెహ్రు నగర్ దయానందనగర్, ప్రాంతాలలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ తో కలిసి గడప గడపకు ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ తోనే అన్ని వర్గాల ప్రజలకు మెలు జరుగుతోందని, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మాటలు విని మోసపోవద్దంటూ బీఆర్ఎస్ అభ్యర్దిని బారి మెజార్టీతో గెలిపించాలని అభ్యర్ధించారు. కార్యక్రమంలో నాయకులు బైరు అనిల్, హనుమంతరావు , చిట్టిబాబు , అనిత తదితరులు పాల్గొన్నారు.



## లిక్కర్ స్కాంలో దొరకనిఊరట

తెలంగాణ వీణ, న్యూఢల్లీ : ఢల్లీ లిక్కర్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌కు మరోసారి చుక్కెదురైంది. నవంబర్ 24న రోస్ అవెన్యూ కోర్టు నుంచి ఉపశమనం లభించలేదు. కోర్టు అతని జ్యుడీషియల్ కస్టడీని డిసెంబర్ 4 వరకు పొడిగించింది. ఆప్ నేత సంజయ్ సింగ్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా జైలులో ఎలక్ట్రిక్ కెటిల్ ఇవ్వడానికి కోర్టు అనుమతించింది. ఈ కేసులో సప్లిమెంటరీ చార్జిషీట్‌ను త్వరలో దాఖలు చేస్తామని ఈడీ తెలిపింది.అక్టోబర్ 4న, ఢల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో సంజయ్ సింగ్‌ను ఇఆ అతని అధికారిక నివాసంపై దాడి చేసింది. గంటల తరబడి విచారించిన తర్వాత అరెస్టు చేసింది. అనంతరం అక్టోబరు 5న న్యాయస్థానం జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. కస్టడీ తేదీ ముగిసిన తర్వాత సింగ్ చాలాసార్లు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. కానీ అతనికి ఉపశమనం లభించలేదు.ఢల్లీ లిక్కర్ పాలసీలో పలువురు డీలర్లకు లబ్ధి చేకూర్చేందుకు లంచాలు తీసుకున్నట్లు ఈడీ ఆరోపించింది. ఈ డబ్బును పార్టీ కోసం వినియోగించినట్లు పేర్కొంది. పాలసీలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో కేజ్రీవాల్ ప్రభుత్వం దానిని ఉపసంహరించుకుంది. అయితే తాను ఎలాంటి తప్పు చేయలేదని , ఓటమి భయం తోనే తనను ప్రతిపక్షాలు టార్గెట్ చేశాయన్నారు సంజయ్ సింగ్.

## శ్రీవారి ఆలయంలో వైభవంగా కైశికద్వాదశి ఆస్థానం

**మాడ వీధుల్లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్రశ్రీనివాసమూర్తి దర్శనం**



తెలంగాణ వీణ, తిరుమల : కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో శుక్రవారం కైశిక ద్వాదశి ఆస్థానం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 4.45 నుండి 5.45 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్రశ్రీనివాస మూర్తి ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారు. అనంతరం ఉదయం 6 నుండి ఉదయం 7.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లను బంగారువాకిలి చెంత వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

**ప్రాశస్త్యం..**

పురాణాల ప్రకారం శ్రీ వైష్ణవ క్షేత్రాల్లో నిర్వహించే ముఖ్యమైన పర్వదినాల్లో కైశికద్వాదశి ఒకటి. శ్రీ వరాహ పెరుమాళ్ కైశికపురాణంలోని 82 శ్లోకాలతో శ్రీ భూదేవికి కథగా చెప్పిన రోజును కైశిక ఏకాదశిగా పిలుస్తారు. ఈ కథ ఆధారంగా కైశిక ద్వాదశి ప్రత్యేకతను సంతరించుకుంది.

# ఏఎస్ రావునగర్ డివిజన్‌లో సీపీఐ, కాంగ్రెస్ విస్తృత ప్రచారం..





తెలంగాణ వీణ, కాప్రా: అవినీతి రహిత పాలన కోసం, ఉప్పల్ నియోజకవర్గం సమగ్రాభివృద్ధి కోసం మార్పు కోసం అందరికి అందుబాటులో ఉండే కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మందుముల పరమేశ్వర్ రెడ్డిని గెలిపించుకోవడానికి ఉప్పల్ నియోజకవర్గ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. ఎస్. బోస్ పిలుపునిచ్చారు. ఏ.ఎస్ రావు నగర్ డివిజన్ లోని కమలనగర్, బృందావన్ కాలనీ, ఏపీఐఐసీ, శ్రీనివాస్ నగర్ కాలనీలలో కరపత్రాలను ఓటర్లకు పంచుతూ ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు, ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఇప్పుడు ఆ సంగతి మరిచిపోయి తమ కుటుంబ ఆస్తులను పెంచుకోవడం పైనే దృష్టి సారించారన్నారు. తమ జేబులు నింపుకోవడానికి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ప్రాజెక్టులు నిర్మిస్తూ తెలంగాణ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో గతంలో జరిగిన స్వార్థ రాజకీయాలను నియోజకవర్గ ప్రజలు గమనించాలని, గత దశాబ్ద కాలంగా ప్రజాసేవలో ఉన్న పరమేశ్వర్ రెడ్డి కి, హస్తం గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. సీపీఐ బలపర్చిన ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మందుముల పరమేశ్వర్ రెడ్డి విజయంలో తోడుగా ఉంటూ, ఎన్నికల ప్రచారంలో పాల్గొని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని స్పష్టంచేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ కార్యదర్శి జీ.దామోదర్ రెడ్డి,సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు రాఘవ రెడ్డి, శ్రీను, నర్సింగ్.ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఏ ఐ వై ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్, సీపీఐ కాప్రా కార్యదర్శి లక్ష్మీ నారాయణ, సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు ఎల్లయ్య, నర్సింగ్ రావు, రాజు, రవి, కీర్తన్, రజిని,లలిత, శోభ,యాకమ్మ,గిరిజ, గిరి బాబు తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం : పద్మారావు గౌడ్






తెలంగాణవీణ, సికింద్రాబాద్ : సికింద్రాబాద్ బీ ఆర్ ఎస్ అభ్యర్థి, డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ శుక్రవారం సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని వివిధ మజీదుల సమీపంలో ముస్లిం మైనారిటీ నేతల ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. చిలకల గుడా బడీ మస్జిద్, చోటి మస్జిద్, ఏక్ మినార్ మస్జిద్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అదే విధంగా స్థానిక కార్పొరేటర్లు, నేతల అధ్వర్యంలో సైతం ఈ కార్యక్రమాలు జరిగాయి. గత పదేళ్లుగా సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో మైనారిటీ ల సంక్షేమానికి నిరంతరం పాటు పడ్డామని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా తెలిపారు. మోజం, ఇమాం ల గౌరవ వేతనం పెంచడంతో పాటు మైనారిటీ ల విద్యావకాశాల మెరుగుదలకు ప్రత్యేక సంస్థలు స్థాపించామని తెలిపారు. సికింద్రాబాద్ లో ఈ ద్గా లను అభివృధి చేశామని వివిధ సదుపాయాలను కల్పించామని తెలిపారు. మైనారిటీ లకు నిత్యం తాము అండగా నిలుస్తున్నామని పద్మారావు గౌడ్ స్పష్టం చేశారు. వివిధ మైనారిటీ సంఘాల నేతలు పద్మారావు గౌడ్ ను కలిసి తమ మద్దతును ప్రకటించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసురి సునీత రమేష్, నేతలు కిషోర్ కుమార్, కిరణ్ కుమార్, రామేశ్వర్ గౌడ్, కరాటే రాజు, కంది నారాయణ తో పై మైనారిటీ నాయకులు పాల్గొన్నారు

**పద్మారావు కే ఓ యూ విద్యార్ధుల మద్దతు**

సికింద్రాబాద్ : ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థుల వ్యవస్థాపక జాయింట్ ఆక్షన్ కమిటీ సికింద్రాబాద్ లో డిప్యూటీ స్పీకర్, బీ ఆర్ ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావు గౌడ్ కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. చిలకలగుడా లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓ యు జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ ఎల్చల దత్తాత్రేయ నేతృత్వంలో ని ప్రతినిధుల బృందం సమావేశమైంది. తెలంగాణా ఉద్యమ సమయంలో కూడా పద్మారావు గౌడ్ నిరంతరం శ్రమించి కీలక పాత్రను పోషించడంతో పాటు విద్యార్ధులకు వేనుదన్నుగా నిలిచారని దత్తాత్రేయ ఈ సందర్భంగా విలేఖరుల సమావేశంలో వివరించారు. ఉద్యమ సందర్భంలో విద్యార్ధులకు అండదండగా నిలవడంతో పాటు నిరంతరం తమ శ్రేయస్సుకు పద్మారావు గౌడ్ కృషి చేశారని ప్రశంసించారు. అందుకే ఎన్నికల్లో ఆయనకు బేషరతుగా మద్దతు తెలపాలని నిర్ణయించు కున్నామని, ఆయనకు మద్దతుగా ప్రచారం కూడా చేస్తామని తెలిపారు. జే ఏ సీ నేతలు పసరకొండ్ కిషోర్, వెంగోండ్ అనిల్ ప్రజాపతి, మనీష్ నరదాస్, నవీన్, మహేందర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ వారికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్ధులు, అధ్యాపకుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తన కృషిని కొనసాగిస్తానని పేర్కొన్నారు



**పద్మారావు కు ఎం ఆర్ పీ ఎస్ నేతల మద్దతు**

అడ్డగుట్ట కు చెందిన ఎం ఆర్ పీ ఎస్ నేత జోగు దశరద్ నేతృత్వంలోని బృందం సికింద్రాబాద్ లో బీ ఆర్ ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ కు తమ మద్దతును ప్రకటించింది. చిలకలగుడా లో పద్మారావు గౌడ్ దశరద్ నేతృత్వంలోని బృందం సమావేశమై తమ పూర్తి మద్దతును బేషరతుగా అందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.


## కెసిఆర్ ను ఫామ్ హోజ్‌కే పరిమితం చేయాలి - విజయశాంతి

**గద్దర్ వెన్నెల ను భారీ మెజారిటీతో గెలిపించాలి**

తెలంగాణవీణ, కంటోన్మెంట్ ;నాలుగున్నర లక్షల జీతం తీసుకుంటూ ఫామ్ హౌస్ కి పరిమితమైన సీఎం కేసీఆర్ ను రానున్న ఎన్నికల్లో గద్దె దించాలని సినీనటి కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెనర్ విజయశాంతి అన్నారు. శుక్రవారం కంటోన్మెంట్ తిరుమల గిరి లాల్ బజార్ లో జరిగిన కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గద్దర్ వెన్నెల కు మద్దత్తు గా రోడ్ షో లో ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రెండుసార్లు తెలంగాణ సెంటిమెంటుతో సీఎం అయిన కేసీఆర్ మూడవసారి కూడా అవకాశం ఇవ్వాలని కోరడం హాస్యాస్పదమన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ నాయకత్వాన్ని బలపరుస్తూ కాంగ్రెస్ ను గెలిపించాలని ఆమె కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయని ఆమె వ్యక్తం చేశారు సీఎం కేసీఆర్ కుమార్తె కవిత లిక్కర్ స్కామ్ లో ఎందుకు అరెస్టు చేయలేదని రాములక్క డిమాండ్ చేశారు. ప్రజా గాయకుడు,విప్లవకారుడు గద్దర్ అన్న బిడ్డ వెన్నెల కు టికెట్ రావటం కంటోన్మెంట్ ప్రజల అదృష్టమన్నారు.వెన్నెల ను అధిక మెజారిటీతో గెలిపించాలని విజయశాంతి కోరారు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన విజయాన్ని అందించాలని ఆమె కోరారు ప్రతి ఒక్కరు హస్తం గుర్తుకు ఓటేసి గద్దర్ వెన్నెల ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజయశాంతి కోరారు ఈ సందర్భంగా కాంగ్రెస్ రోడ్ షో కు హాజరైన మహిళలతో ప్రమాణం చేయించారు .వెన్నెల గెలిస్తే ప్రజల్లో ఉంటుందన్నారు.



## బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపిన వీరశైవ లింగాయత్‌లు



తెలంగాణవీణ, జవహర్ నగర్ ; జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వీరశైవ లింగాయత్ కుటుంబాలు బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి కి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి మల్లారెడ్డి క్యాంపు కార్యాలయంలో తెలంగాణ వీరశైవ లింగాయత్ రాష్ట్ర యువజన అధ్యక్షుడు అలురె ఈశ్వర్ ప్రసాద్, 9వ డివిజన్ కార్పొరేటర్ శారదా, ఆమె భర్త మనోధర్ రెడ్డి అధ్వర్యంలో వీరశైవ లింగాయత్ కమిటీ మంత్రిని కలిసి మద్దతు తెలిపారు. ఎన్నికల సమయంలో కమిటీ కోరిక మేరకు రుద్రభూమి, కమ్యూనిటీ హాల్ భూమి ఇస్తానని మంత్రి హామీ ఇచ్చారని కమిటీ తెలిపింది. అలురె మాల్ శెట్టి, గురురాజ్, విజయ్, సంజు స్వామి, రతికాంత్, రమేష్, శివరాజ్, అరుణ్, హన్మంత్, బద్రి, శంకర్, రాజు,రాజకుమార్, ధనరాజ్, కార్తీక్ లు పాల్గొని బీఆర్ఎస్ కు మద్దతు ప్రకటించారు.




# ఉక్కు సత్యాగ్రహం సినిమా ట్రైలర్, సాంగ్స్ లాంచ్ చేసిన గద్దర్ కుమార్తె వెన్నెల



హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్ లో ఉక్కు సత్యాగ్రహం సినిమా గద్దర్ కుమార్తె వెన్నెల ట్రైలర్, సాంగ్స్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మా నాన్నగారైన గద్దర్ ప్రజల కోసం ఎంతో పాటు పడేవారు. ఆయన రాసిన పాటలు గాని, గేయాలు గాని అన్ని ప్రజల కోసము ప్రజల సమస్యల మీదనే ఉండేవి. కరోనా సమయంలో కూడా ఆంధ్ర తెలంగాణ ఇరు రాష్ట్రాల్లోనే అన్ని ప్రాంతాలు తిరిగి ప్రజల కోసం ఎంతో సేవ చేశారు అలాగే వారి సమస్యలను ఉద్దేశిస్తూ ఎన్నో పాటలను కూడా ఆయన రాశారు పాడారు. అలాగే ప్రజా సమస్యల పైన పోరాడే చిత్రాలను ఎక్కువగా నటించిన నాన్నగారు ఈ సినిమాలో పాటలు రాయడంతోపాటు నటించారు. బస్ కండక్టర్, డాన్సర్ ఘన్సీ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో సోషల్ మీడియా అనేది ఎక్కువగా విస్తరిస్తుంది. సోషల్ మీడియా ద్వారా మంచి జరుగుతుంది చెడు జరుగుతుంది. అలాగే సినిమాలు కూడా మంచిగానే చెడును గాని తెలిపేందుకు మరగ దర్శకాలుగా ఉన్నాయి. ఈ సినిమాలో నేను నటించడానికి కారణం జన సమస్యలను పరిష్కరించే ఒక మంచి చిత్రం ఇది మంచి అంశాలతో కూడుకున్న కథ అందువల్లనే చిత్రంలో నటించాలని అనుకున్నాను. అలాగే నాకు ఈ చిత్రంలో అవకాశం ఇచ్చిన సత్యారెడ్డి కి ధన్యవాదాలు అని అన్నారు.దర్శకుడు త్రినాధరావు నక్కిన మాట్లాడుతూ : గద్దర్ గొప్ప రచయిత అలాగే గాయకుడు మంచి నటుడు ప్రజా సమస్యల కోసం ఎంతో పాటుపడిన వ్యక్తి ఆయన్ని కలవాలని అనుకోని వారు ఉండరు అలాంటి వాళ్ళలో నేను ఒకడిని. ఈ చిత్రం ద్వారా ఆయనని కలిసే అవకాశం నాకు లభించింది అది అదృష్టంగా భావిస్తున్నాను. నేనొక కమర్షియల్ దర్శకుని అయినా నాకు ఉద్యమంతో కూడినవి అలాగే ప్రజా సమస్యలతో కూడిన ఉద్యమాలు చేసే సినిమాలు అంటే నాకు చాలా ఇష్టం. ఈవెంట్ కి నన్ను పిలిచినందుకు సత్య రెడ్డికి కృతజ్ఞతలు అలాగే ఈ సినిమా మంచి విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు. విశాఖపట్నం (చోడవరం) ఎమ్మెల్యే ధర్మశ్రీ మాట్లాడుతూ : ఈరోజు సత్యా రెడ్డి జన్మదిన సందర్భంగా ముందుగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ చిత్రానికి సంబంధించిన నన్ను కూడా ఒక భాగము చేయడం అనేది చాలా సంతోషంగా ఉంది అని అన్నారు. విశాఖపట్నం ఉక్కు సమస్యలకు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లోని మూడు ప్రాంతాల వారు ఎంత కృషి చేశారు ఎంతో మంది ప్రాణ త్యాగం చేశారు అన్న దాని గురించి ఉక్కు సత్యాగ్రహంగా ఈ సినిమాను తీసుకురావడం చాలా మంచి విషయం. అలాగే రచయిత గాయకుడు నాయకుడు అయిన గద్దర్ ఈ సినిమాలో రెండు పాటల్లో నటించడం అనేది అలాగే గద్దర్ మా వెనక్కున్నారు ప్రజల సమస్యల కోసం పోరాడే వ్యక్తి మాతో ఉండి మాకు ధైర్యాన్ని మాకు ఇచ్చారు అని అన్నారు. దర్శకుడు సత్యా రెడ్డి మాట్లాడుతూ : ఈ సినిమా నేను చేయడానికి గల ముఖ్య కారణం గద్దర్ ఆయనతో నాకున్న అనుబంధం మర్చిపోలేనిది. గద్దర్ నాకు తండ్రితో సమానం ఆయన వయసుతో సంబంధం లేకుండా అందరితోనూ కలివిడిగా కలిసిపోయి ఉండేవారు. ఆయన ఈ రోజున మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం కాకపోతే ఆయన కూతురు అయిన వెన్నెల ని ఆయన రూపంలో మాకు బహుమతిగా అందించారు. గద్దర్ తో ఉన్న జ్ఞాపకాలని పంచుకున్నారు. అదేవిధంగా ఈ సినిమా విశాఖ ఉక్కు ఉద్యమానికి సంబంధించిన సమస్యల్ని తెలియజేస్తూ తీశాము. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిధులు త్రినాధరావు నక్కిన గారికి మరియు ఎమ్మెల్యే ధర్మ శ్రీ గారికి కృతజ్ఞతలు తెలిపారు. నటీనటులు : గద్దర్, సత్యా రెడ్డి, 'పల్సర్ బైక్' ఝాన్సీ, ఎమ్మెల్యే ధర్మశ్రీ, ఎం వి వి సత్యనారాయణ, ప్రసన్నకుమార్, వెన్నెల.

# అక్క గా కీర్తి సురేష్


ఇండియన్ సినీ ఇండస్ట్రీలో భారీ సినిమాలను రూపొందిస్తూ తనదైన గుర్తింపును సంపాదించుకున్న ప్రొడక్షన్ హౌస్ యష్ రాజ్ ఫిలిమ్స్. మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌కి శ్రీకారం చుట్టింది. సీట్ ఎడ్జ్ రివేంజ్ థ్రిల్లర్ జోనర్‌లో పీరియాడిక్ థ్రిల్లర్‌గా వెబ్ సిరీస్‌ను తెరకెక్కించనున్నారు. చిత్ర పరిశ్రమలో విలక్షణమైన పాత్రలతో మెప్పిస్తోన్న వెర్సటైల్ యాక్టర్స్ కీర్తి సురేష్, రాధికా ఆప్టే ఇందులో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

''మన చిత్ర పరిశ్రమలో కీర్తి సురేష్, రాధికా ఆప్టే వంటి నటీమణులు ఉండటం అనేది మనకు ఓ బహుమానంగా చెప్పొచ్చు. వారు సహజ సిద్ధమైన నటనతో మెప్పిస్తారు. వారి అద్భుతమైన నటనతో ప్రశంసలను పొంది తద్వారా తమదైన క్రేజ్‌ను వారు సంపాదించుకున్న సంగతి తెలిసిందే. పోటా పోటీగా నటించే వీరిద్దరూ కలిసి 'అక్క' అనే స్ట్రీమింగ్ ప్రాజెక్ట్‌తో అలరించబోతున్నారు. ఇదే ఇప్పుడు ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది'' అని ట్రేడ్ వర్గాలు పేర్కొన్నాయి. ఆదిత్య చోప్రా నిర్మాతగా ధర్మరాజ్ శెట్టి అనే డెబ్యూ డైరెక్టర్ ఈ ప్రాజెక్ట్‌ని రూపొందిస్తున్నారు. 'అక్క' ప్రాజెక్ట్‌పై డైరెక్టర్ విజన్‌ని గుర్తించిన ఆదిత్య చోప్రా భారీ బడ్జెట్‌తో 'అక్క' సిరీస్‌ను వైఆర్ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలను సీక్రెట్‌గానే ఉంచుతున్నారంటూ సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. రీసెంట్‌గా ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన 'ది రైల్వే మెన్' వెబ్ సిరీస్‌ను వైఆర్ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ తమ మొదటి వెబ్ సిరీస్‌గా రూపొందించింది. ఇందులో ఆర్.మాధవన్, కె.కె.మీనన్, దివ్యేందు శర్మ, బాబిల్ ఖాన్ తదితరులు నటించారు. 1984 భోపాల్ గ్యాస్ దుర్ఘటన ఆధారంగా దీన్ని తెరకెక్కించి రిలీజ్ చేయగా వరల్డ్ వైడ్ టాప్ టెన్ వెబ్ సిరీస్‌ల్లో ఒకటిగా నెట్‌ఫ్లిక్స్‌లో ఇది ట్రెండ్ అవుతుంది.

అలాగే వైఆర్ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రూపొందిన సెకండ్ వెబ్ సిరీస్ మండల మర్డర్స్.



ఇది మల్టీ సీజన్ సిరీస్. క్రైమ్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కిన ఈ సిరీస్‌లో వాణీ కపూర్ ప్రధాన పాత్రలో నటించారు. ట్రాన్స్‌జెండర్ పాత్రలో ఆమె నటనకు చాలా మంచి ప్రశంసలు దక్కాయి. ఇదే ఆమె తొలి డిజిటల్ ఎంట్రీ. వైభవ్ రాజ్ గుప్తా, సుర్వీన్ చావ్లా, జమీల్ ఖాన్ తదితరులు ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సిరీస్ ఇప్పుడు చిత్రీకరణను జరుపుకుంటోంది.మన ఆడియెన్స్ కోసం వైవిధ్యమైన కంటెంట్‌ను రూపొందించటానికి వైఆర్ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ భారీ స్థాయిలో రూపొందించటానికి సిద్ధంగా ఉంది. మన కంటెంట్‌ను గ్లోబల్ రేంజ్ ఆడియెన్స్‌కు దగ్గర కావటంలో వైఆర్ఎఫ్ కీలక భూమికను పోషిస్తోంది. ది రైల్వే మెన్ సక్సెస్ అనేది ఈ సంస్థకు ఓ రన్ వేలా మారిందని అందరూ అప్రిషియేట్ చేస్తున్నారు. 'ది రైల్వే మెన్'ను చూసిన వారందరూ అభినందిస్తున్నారు. సమీక్షలు కూడా పాజిటివ్‌గా వచ్చాయి. మౌత్ టాక్‌తో ఇది ప్రేక్షకులకు మరింత చేరువైందని సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి.



## నవంబర్ 27న 'హరోం హర' పవర్ ఆఫ్ సుబ్రమణ్యం టీజర్‌విడుదల

హీరో సుధీర్ బాబు పాన్ ఇండియా చిత్రం 'హరోం హర'. సెహరి ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో ఎస్ఎస్ సి (శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్) బ్యానర్‌పై సుమంత్ జి నాయుడు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సుధీర్ బాబుకు ఇది అత్యంత భారీ బడ్జెట్ మూవీ. ది రివోల్ట్ అనేది సినిమా ట్యాగ్‌లైన్. తాజాగా ఈ చిత్రం టీజర్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. 'హరోం హర' పవర్ ఆఫ్ సుబ్రమణ్యం టీజర్ నవంబర్ 27న విడుదల కానుంది. అనౌన్స్ మెంట్ పోస్టర్ లో నిప్పుల కొలిమిలో ఓ ప్రత్యేకమైన ఆయుధాన్ని కాల్చుతూ మజిల్డ్ బాడీతో ఇంటెన్స్ లుక్ లో కనిపించారు సుధీర్ బాబు. ఈ పోస్టర్ చాలా క్యూరియాసిటీని పెంచింది. ఈ చిత్రంలో మాళవిక శర్మ హీరోయిన్ గా నటిస్తోంది. సునీల్, అక్షర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. చిత్తూరు జిల్లా కుప్పంలో 1989 నాటి నేపథ్యంలో సాగే 'హరోం హర' కథలో సుధీర్ బాబు కుప్పం యాసలో డైలాగులు పలకనున్నారు.ప్రముఖ సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికి పని చేస్తున్నారు. అరవింద్ విశ్వనాథన్ సినిమా సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. చైతన్ భరద్వాజ్ సంగీతం సమకూరుస్తున్నారు. 'హరోం హర' తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.తారాగణం: సుధీర్ బాబు, మాళవిక శర్మ, సునీల్, అక్షర

# "వధువు" వెబ్ సిరీస్ ట్రైలర్ రిలీజ్

సరికొత్త కంటెంట్ తో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్న డిస్నీ ప్లస్ హాట్ స్టార్ అందిస్తున్న మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ "వధువు". ఈ వెబ్ సిరీస్ లో అవికా గోర్, నందు, అలీ రెజా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ వెబ్ సిరీస్ ను ఎస్వీఎఫ్ బ్యానర్ లో శ్రీకాంత్ మొహ్తా, మహేంద్ర సోని నిర్మిస్తున్నారు. పోలూరు కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. డిసెంబర్ 8వ తేదీ నుంచి "వధువు" వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కాబోతోంది. ఇవాళ ఈ వెబ్ సిరీస్ ట్రైలర్ రిలీజ్ చేశారు. "వధువు" వెబ్ సిరీస్ ట్రైలర్ ఎలా ఉందో చూస్తే...'వెయ్యి అబద్ధాలు ఆడైనా ఒక పెళ్లి చేయాలంటారు. కానీ ఈ పెళ్లిలో అన్నీ రహస్యాలే అంటూ పెళ్లి కూతురు ఇందు చెప్పిన డైలాగ్ తో ట్రైలర్ ప్రారంభమైంది. ఆనంద్ ను పెళ్లి చేసుకుని అత్తవారింటికి వెళ్లిన ఇందుపై వివిధ రకాలుగా హత్యా యత్నాలు జరుగుతుంటాయి. ఇవన్నీ అనుకోకుండా జరిగినట్లు కాకుండా.. ఎవరో కావాలని చేసినట్లే ఉంటాయి. అత్తవారింట్లో ప్రతిఒక్కరి ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపిస్తుంటుంది. ఓ అపరిచిత క్యారెక్టర్ లోని మహిళ అసలైన ఆట ఇప్పుడే మొదలైంది అనడం...ఇందుకు రాబోతున్న ప్రమాదాలను సూచిస్తుంది. ఇందు ఈ మిస్టరీలోని నిజాల్ని తెలుసుకుందా..?ప్రశ్నలా మిగిలిన అత్తవారింటి ప్రవర్తన వెనుక కారణాలు కనుక్కుందా? అనే సందేహాలతో వధువు ట్రైలర్ ఆసక్తికరంగా కంప్లీట్ అయ్యింది. వధువు వెబ్ సిరీస్ చూడాలనే క్యూరియాసిటీ ట్రైలర్ క్రియేట్ చేసింది.నటీనటులు ` అవికా గోర్, నందు, అలీ రెజా, వీఎస్ రూపా లక్ష్మి, మౌనిక, మాధవి ప్రసాద్, శ్రీధర్ రెడ్డి, అమ్మ రమేష్, కాంచన్ బమ్నే, కేఎల్ కే మణి,



శ్రీదేవి అగ్రోజు, సౌజాస్, ఇందు అబ్బే, సురభి పద్మజ, తులసీ శ్రీనివాస్, సురభి దీప్తి, శుభశ్రీ రాయ్ తదితరులు

# 24 గంటల్లో 30 మిలియన్స్ వ్యూస్‌తో దూసుకెళ్లోన్న 'డంకీ డ్రాప్ 2` పాట

బాలీవుడ్ బాద్ షా షారూక్ ఖాన్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ రాజ్‌కుమార్ హిరాణి కాంబినేషన్‌లో రూపొందుతోన్న మోస్ట్ అవెయిటింగ్ మూవీ 'డంకీ'. బుధవారం ఈ చిత్రం నుంచి 'డంకీ డ్రాప్ 2' అంటూ సినిమా నుంచి 'లుట్ పుట్ గయా..' పాటను మేకర్స్ విడుదల చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ సంగీతాభిమానుల హృదయాలను ఈ పాట హత్తుకుంది. ప్రేమలోని స్వచ్ఛతను తెలియజేసే ఈ పాట కచ్చితంగా మీ ప్లే లిస్టులో స్థానాన్ని కలిగి ఉంటుందనటంలో సందేహం లేదు. ఆడియెన్స్‌కి తిరుగులేని ట్రీట్‌ని అందించిన 'లుట్ పుట్ గయా..' పాట విడుదలైన 24 గంటల్లోనే 30 మిలియన్ వ్యూస్‌ను సంపాదించుకుంది. దీంతో రాజ్‌కుమార్ హిరాణి రూపొందిస్తోన్న 'డంకీ' ప్రపంచంలో ఇంకెన్ని ఆసక్తికరమైన విషయాలు ఉండబోతున్నాయోనని అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సినిమాపై అంచనాలు పెరిగాయి.

షారూక్ ఖాన్ పాత్ర ఇంకెలా ఉంటుందోననే ఆసక్తి అభిమానులకు, సినీ ప్రేక్షకులకు కలిగింది. ఇదే ఆసక్తిని వారు చంబసూతీస సెషన్‌లో కనపరిచారు. లుట్ పుట్ గయా పాటపై తమ ప్రేమను వారు మాటల రూపంలో కింగ్ ఖాన్‌కి తెలియజేశారు. 'డంకీ' చిత్రంలో టాలెంటెడ్ ఆర్టిస్టులు ప్రేక్షకులను మెప్పించటానికి సిద్ధమవుతున్నారు. బోమన్ ఇరాని, తాప్సీ పన్ను, విక్కీ కౌశల్, విక్రమ్ కొచ్చర్, అనిల్ గ్రోవర్ సహా బాలీవుడ్ బాద్ షా షారూక్ ఖాన్ ప్రేక్షకుల హృదయాలను దోచుకోనున్నారు. ఏ జియో స్టూడియోస్, రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్మెంట్, రాజ్‌కుమార్ హిరాణి ఫిల్మ్స్ బ్యానర్స్ సమర్పణలో రాజ్ కుమార్ హిరాణి, గౌరి ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అభిజీత్ జోషి, రాజ్ కుమార్ హిరాణి, కణిక ఢిల్లాన్ ఈ చిత్రానికి రచయితలు. ఈ చిత్రం క్రిస్మస్ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున డిసెంబర్ 21న రిలీజ్ అవుతుంది.



# 'డబుల్ ఇస్మార్ట్' లో మణిశర్మ ఆన్ బోర్డ్



సెన్సేషనల్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్, మెలోడీ బ్రహ్మ మణిశర్మలది బ్లాక్ బస్టర్ కాంబినేషన్. పోకిరి, చిరుత, ఇస్మార్ట్ శంకర్ చిత్రాలు చార్ట్ బస్టర్ ఆడియో, బాక్సాఫీస్ హిట్స్ గా నిలిచాయి. ఉస్తాద్ రామ్ పోతినేనితో దర్శకుడు పూరీ జగన్నాథ్ చేస్తున్న తాజా చిత్రం 'డబుల్ ఇస్మార్ట్' కోసం ఈ బ్లాక్ బస్టర్ కాంబినేషన్ మరోసారి కలిసి పనిచేస్తున్నారు. ఇస్మార్ట్ శంకర్ మ్యూజికల్ గా పెద్ద హిట్ అయ్యింది. సీక్వెల్ ఖచ్చితంగా చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌ను అందించనుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో జరుగుతోంది.బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ ఈ చిత్రంలో ఇంపార్టెంట్,లెన్తీ రోల్ ని పోషిస్తున్నారు. ఇందులో ప్రముఖ నటీనటులు కూడా ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. రామ్, సంజయ్ దత్ పేస్ ఆఫ్ చూడటానికి అభిమానులు ఆసక్తిగా ఉన్నారు.రామ్, పూరీ జగన్నాధ్ డెడ్లీ కాంబినేషన్‌లో డబుల్ ఇస్మార్ట్ చిత్రాన్ని పూరీ కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మిస్తున్నారు.పూరి జగన్నాథ్ బిగ్ స్పాన్ వున్న కథను రాశారు. పూర్తిగా స్టైలిష్ అవతార్ లో ప్రధాన నటీనటులను ప్రజెంట్ చేస్తున్నారు. సినిమాలో రామ్ స్టైలిష్ బెస్ట్ లుక్ లో కనిపించనున్నారు. సాంకేతికంగా అత్యున్నత ప్రమాణాలతో హై బడ్జెట్‌తో డబుల్ ఇస్మార్ట్ రూపొందుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు మేకర్స్.డబుల్ ఇస్మార్ట్ మార్చి 8, 2024న మహా శివరాత్రికి తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం , హిందీ భాషల్లో విడుదల కానుంది.

# మాస్ మహారాజా రవితేజ, 'ఈగల్' షూటింగ్ పూర్తి`



మాస్ మహారాజా రవితేజ మోస్ట్ ఎవైటెడ్ ఇంటెన్స్ అండ్ యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్' థియేట్రికల్ రాకకు కౌంట్ డౌన్ ప్రారంభమైంది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 13న విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా మేకర్స్ ఈగల్ నుంచి రవితేజ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.50 డేస్ కౌంట్‌డౌన్ పోస్టర్‌లో రవితేజ డెస్క్‌పై చాలా ఆయుధాలతో కనిపించారు. స్టైలిష్ డ్రెస్సింగ్ లో చాలా ఇంటెన్స్ లుక్ లో ఆకట్టుకున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.టీజర్ అద్భుతమైన రెస్పాన్స్ తో క్యూరియాసిటీ పెంచింది. కౌంట్‌డౌన్ ప్రారంభం కావడంతో మేకర్స్ మరింత దూకుడు పెంచారు. సినిమాలో రవితేజ మల్టీ షేడ్స్ ఉన్న పాత్రలో నటిస్తున్నారు. కావ్య థాపర్ కథానాయికగా నటిస్తుండగా, అనుపమ పరమేశ్వరన్ మరో కథానాయికగా నటించింది. నవదీప్, మధుబాల ఇతర ముఖ్య తారాగణం.కార్తీక్ ఘట్టమనేని ఎడిటింగ్ ద దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి మణిబాబు కరణంతో పాటు దర్శకుడు స్వయంగా స్క్రీన్ ప్లే రాశారు. టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.మణిబాబు కరణం డైలాగ్స్ అందించారు. దావ్‌జాంద్ సంగీత సమకూరుస్తున్నారు. శ్రీనాగేంద్ర తంగల ప్రొడక్షన్ డిజైనర్. తారాగణం: రవితేజ, కావ్య థాపర్, అనుపమ పరమేశ్వరన్, నవదీప్, శ్రీనివాస్ అవసరాల, మధుబాల, ప్రణీత పట్నాయక్, అజయ్ ఘోష్, శ్రీనివాస్ రెడ్డి, భాషా, శివ నారాయణ, మిర్చి కిరణ్, నితిన్ మెహతా, ధ్రువ, ఎడ్వర్డ్, మద్ది, జరా, అక్షర





### థ్రిల్లర్ మ్యాచ్‌లో లెక్కలోకి రాకుండా పోయిన రింకూ సింగ్ చివరి సిక్సర్..

# అందుకు కారణం ఇదే!

**చివరి బంతికి సింగిల్ అవసరమవ్వగా సిక్సర్ కొట్టిన రింకూ సింగ్**

**సిక్సర్ కొట్టిన బంతి నో బాల్ కావడంతో విజయం సాధించిన భారత్**

**గెలుపు పూర్తవ్వడంతో లెక్కలోకి రాకుండా పోయిన రింకూ సిక్సర్**

గురువారం విశాఖపట్నం వేదికగా జరిగిన మొదటి టీ20లో ఆస్ట్రేలియాపై టీమిండియా ఉత్కంఠభరిత విజయం సాధించింది. 208 పరుగుల లక్ష్యాన్ని మరొక బంతి మిగిలివుండగానే గెలిచింది. సీన్ అబ్బాట్ వేసిన చివరి ఓవర్‌లో 7 పరుగులు అవసరమవ్వగా అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, అర్షదీప్ సింగ్‌లు వరుసగా ఔటవ్వడం ఉత్కంఠను రేపింది. భారత్ గెలుపుపై సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే చివరి బంతికి 1 పరుగు అవసరమవ్వగా క్రీజులో ఉన్న రింకూ సింగ్ భారీ సిక్సర్ కొట్టి టీమిండియాకి విజయాన్ని కట్టబెట్టాడు. దీంతో అభిమానుల అరుపులు, కేకలతో విశాఖపట్నం స్టేడియం మోతెక్కిపోయింది. అయితే టీమిండియాని గెలిపించిన రింకూ చివరి సిక్సర్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. సిక్సర్ కొట్టిన బంతి 'నో బాల్'గా అంపైర్లు నిర్ధారించారు. కావాల్సిన ఒక్క పరుగు నో బాల్ రూపంలో రావడంతో భారత్ విజయం సాధించింది. దీంతో రింకూ కొట్టిన సిక్సర్‌ను లెక్కలోకి తీసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. నో బాల్ కారణంగా రింకూ కష్టపడి కొట్టిన భారీ సిక్సర్ లెక్కలోకి రాకుండా పోయింది.

కాగా ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై భారత్ 2 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. జోస్ ఇంగ్లిష్ 110 పరుగులతో రాణించడంతో ఆస్ట్రేలియా భారీ స్కోరు నమోదు చేసింది. 209 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ ఇన్నింగ్స్ ఆరంభం నుంచి దూకుడుగా ఆడింది. అయితే చివరి ఓవర్‌లో హైడ్రామా నడిచింది. అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, అర్షదీప్ సింగ్ వరుసగా ఔటవ్వడం నాటకీయంగా మారింది. అయితే క్రీజులో రింకూ ఉండడంతో భారత్ విజయం సాధించింది. 19.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్ హాఫ్ సెంచరీలతో రాణించి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించారు. దీంతో 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ భారత్ 1-0తో ఆధిక్యంలో ఉంది. 42 బంతుల్లోనే 9 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 80 పరుగులు చేసిన టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డ్ దక్కింది.



### టీ20 వరల్డ్ కప్‌కు టీమిండియాలో

# వాళ్లిద్దరూ కూడా ఉండాలి: వసీం అక్రమ్

**వచ్చే ఏడాది జూన్ లో టీ20 వరల్డ్ కప్ టీమిండియాలో కోహ్లి, రోహిత్ శర్మ కూడా ఉండాలన్న వసీం అక్రమ్**

**వాళ్లిద్దరి అనుభవం జట్టుకు ఎంతో అవసరమని వ్యాఖ్య**

**కేవలం యువ ఆటగాళ్ల మీదే ఆధారపడలేమని వివరణ**

వన్డే వరల్డ్ కప్ ముగియడంతో, ఇప్పుడందరూ వచ్చే ఏడాది జరిగే టీ20 వరల్డ్ కప్ గురించి మాట్లాడుతున్నారు. పాకిస్థాన్ స్వింగ్ లెజెండ్ వసీం అక్రమ్ కూడా టీ20 వరల్డ్ కప్ కోసం టీమిండియా ఎంపికపై తన అభిప్రాయాలను వెల్లడించాడు.

ఈ మినీ వరల్డ్ కప్ కోసం ఎంపిక చేసే టీమిండియాలో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ కూడా ఉండాలని అన్నాడు. "మరికొన్ని నెలల్లోనే టీ20 వరల్డ్ కప్ జరగనుంది. నేనైతే ఆ ఇద్దరిని జట్టులోకి తీసుకుంటాను. రోహిత్ శర్మ, కోహ్లి టీమిండియాకు ప్రధాన ఆటగాళ్లు. అందులో ఎలాంటి సందేహం లేదు. టీ20ల్లో ఆడేటప్పుడు కొంచెం అనుభవజ్ఞుల అవసరం కూడా ఉంటుంది. కేవలం యువ ఆటగాళ్ల మీదే ఆధారపడలేం" అని అక్రమ్ వివరించాడు.

గత కొన్ని నెలలుగా టీమిండియా టీ20 జట్టును హార్దిక్ పాండ్యా నడిపిస్తున్నాడు. రోహిత్ శర్మ టెస్టులు, వన్డేల్లోనే కెప్టెన్ గా కొనసాగుతున్నాడు. ఇటీవల బీసీసీఐ... టీ20ల్లో కొనసాగడంపై నిర్ణయం తీసుకోవాలని కోహ్లి, రోహిత్ లకు సూచించింది. అయితే టీ20ల్లో కొనసాగడమా, వద్దా అనేది పూర్తిగా వాళ్ల నిర్ణయానికే వదిలేస్తున్నట్టు బోర్డు వర్గాలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో అక్రమ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

టీమిండియా మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. టీ20 వరల్డ్ కప్ లోనూ రోహిత్ శర్మే టీమిండియా కెప్టెన్ గా వ్యవహరించాలని, కోహ్లి కూడా ఈ టోర్నీలో ఆడాలని గంభీర్ పేర్కొన్నాడు.



### డబ్ల్యూపీఎల్: మహిళా క్రికెటర్ల వేలానికి


# ముహూర్తం ఖరారు

**గత సీజన్ నుంచి భారత్ లో డబ్ల్యూపీఎల్**

**తొలి సీజన్ విజేత ముంబయి ఇండియన్స్ మహిళల జట్టు**

**డబ్ల్యూపీఎల్ రెండో సీజన్ కు సన్నాహాలు**

**డిసెంబరు 9న మహిళా క్రికెటర్ల వేలం**




భారత్ లో గత సీజన్ నుంచి ఐపీఎల్ తరహాలో మహిళా క్రికెటర్ల కోసం డబ్ల్యూపీఎల్ (ఉమెన్స్ ప్రీమియర్ లీగ్) నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. డబ్ల్యూపీఎల్-2023 సీజన్ లో ముంబయి ఇండియన్స్ మహిళల జట్టు విజేతగా నిలిచింది. ఇప్పుడు రెండో సీజన్ కు సన్నాహాలు జరుగుతున్నాయి. డబ్ల్యూపీఎల్-2024 సీజన్ కోసం డిసెంబరు 9న మహిళా క్రికెటర్ల వేలం ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ వేలం ప్రక్రియ ముంబయిలో జరగనుంది. ఢిల్లీ క్యాపిటల్స్, ముంబయి ఇండియన్స్, గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్లు డబ్ల్యూపీఎల్ వేలంలో పాల్గొననున్నాయి. ఈ జట్లు ఇప్పటికే 60 మంది మహిళా క్రికెటర్లను అట్టిపెట్టుకున్నాయి. వారిలో 21 మంది విదేశీ క్రికెటర్లు. అదే సమయంలో ఆయా జట్లు 29 మంది మహిళా క్రికెటర్లను విడుదల చేశాయి. విడుదలైన మహిళా క్రికెటర్లు వేలం ప్రక్రియలో అందుబాటులోకి రానున్నారు.అత్యధికంగా గుజరాత్ జెయింట్స్ జట్టు సగం మంది మహిళా క్రికెటర్లను జట్టు నుంచి విడుదల చేసింది. ప్రస్తుతం ఆ ఫ్రాంచైజీ వద్ద వేలంలో ఖర్చు చేసేందుకు రూ.5.95 కోట్లు ఉన్నాయి.

## విశాఖ టీ20లో ఇంగ్లిస్ విధ్వంసక సెంచరీ... ఆసీస్ భారీ స్కోరు

విశాఖలో టీమిండియాతో తొలి టీ20లో ఆస్ట్రేలియా జట్టు భారీ స్కోరు సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన ఆసీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 208 పరుగులు చేసింది. ఆసీస్ బ్యాటర్ జోష్ ఇంగ్లిస్ సూపర్ సెంచరీ నమోదు చేయడం ఈ ఇన్నింగ్స్ లో హైలైట్. జోష్ ఇంగ్లిస్ 50 బంతుల్లోనే 110 పరుగులు చేయడం విశేషం. టీమిండియా యువ బౌలర్లను ఇంగ్లిస్ ఉతికారేశాడు. అతడి స్కోరులో 11 ఫోర్లు, 8 సిక్సులు ఉన్నాయి. అంతకుముందు, ఓపెనర్ గా వచ్చిన స్టీవ్ స్మిత్ 41 బంతుల్లో 8 ఫోర్లతో 52 పరుగులు చేశాడు. స్మిత్ రనౌట్ రూపంలో వెనుదిరిగాడు. చివర్లో టిమ్ డేవిడ్ (19 నాటౌట్) ధాటిగా ఆడడంతో 200 మార్కు దాటింది. టీమిండియా బౌలర్లలో రవి బిష్ణోయ్ 1, ప్రసిద్ధ్ కృష్ణ 1 వికెట్ తీశారు.

## ఆస్ట్రేలియా స్టార్ బ్యాట్స్ మెన్ మిచెల్ మార్ష్ పై ఢిల్లీలో కేసు నమోదు

**వరల్డ్ కప్ పై కాళ్లు పెట్టిన మిచెల్ మార్ష్**

**మండిపడుతున్న క్రికెట్ అభిమానులు**

**పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆర్టీఐ యాక్టివిస్ట్ పండిట్ కేశవ్**



వన్డే ప్రపంచకప్ గెలిచిన తర్వాత ఆస్ట్రేలియా ఆటగాళ్లు వ్యవహరించిన తీరు విమర్శలకు దారి తీసింది. ముఖ్యంగా ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు మిచెల్ మార్ష్ ప్రపంచకప్ ట్రోఫీపై కాళ్లు పెట్టి, బీరు తాగుతూ దిగిన ఫొటో సంచలనం రేకెత్తించింది. ప్రపంచ కప్ ను ఎంతో గొప్పగా భావించే వారంతా ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నారు. ఆస్ట్రేలియా ఆటగాళ్లకు ఇంత అహంకారమా అని మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ కు చెందిన ఆర్టీఐ యాక్టివిస్ట్ పండిట్ కేశవ్ ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు మిచెల్ మార్ష్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ట్రోఫీని అవమానించడమే కాక... 140 మంది భారతీయుల సెంటిమెంట్ ను గాయపరిచారని ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. అయితే ఈ కేసు విషయంలో ఢిల్లీ పోలీసులు ఎలా ముందుకు వెళ్తారనే విషయంపై ఆసక్తి నెలకొంది.


### వరల్డ్ కప్ ట్రోఫీపై మిచెల్ మార్ష్ కాళ్లు పెట్టడంపై


# పేసర్ మహ్మద్ షమీ స్పందన

**మార్ష్ ప్రవర్తనతో బాధపడ్డానని చెప్పిన షమీ**

**ఆటగాళ్ల తలపైన పెట్టాలనుకుంటున్న ట్రోఫీపై కాళ్లు పెట్టడంపై మండిపాటు**

**మ్యాచ్‌కు ముందు పిచ్‌ను పరిశీలించడంపై నమ్మకం లేదని అభిప్రాయపడ్డ షమీ**






వరల్డ్ కప్ 2023 ఫైనల్ మ్యాచ్‌లో భారత్‌పై ఆస్ట్రేలియా విజయం సాధించాక ఆసీస్ ఆటగాళ్ల సెలబ్రేషన్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అందులో వరల్డ్ కప్ ట్రోఫీపై ఆస్ట్రేలియా ఆటగాడు మిచెల్ మార్ష్ కాళ్లు పెట్టి కనిపించిన ఫొటో చర్చనీయాంశమైంది. మార్ష్‌పై నెటిజన్లు తీవ్రంగా విరుచుకుపడ్డారు. పలువురు మాజీలు సైతం మార్ష్ ప్రవర్తనను తప్పుబడుతున్నారు. తాజాగా ముగిసిన వరల్డ్ కప్‌లో అత్యధిక వికెట్లు తీసిన టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ షమీ కూడా మార్ష్ తీరుపై విచారం వ్యక్తం చేశాడు. "నేను బాధపడ్డాను. ప్రపంచంలోని అన్ని జట్లు పోరాడే ట్రోఫీ. ఆటగాళ్ల తలపైన పెట్టాలనుకుంటున్న ట్రోఫీపై కాళ్లు పెట్టడం నాకు సంతోషాన్ని కలిగించలేదు'' అని మహ్మద్ మండిపడ్డాడు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడాడు.

పిచ్ స్వభావాన్ని పరిశీలించడంపై నమ్మకం లేదు..

క్రికెట్ పిచ్‌ల స్వభావాన్ని ముందుగా పరిశీలించడంపై తనకు అంతగా నమ్మకంలేదని మహ్మద్ షమీ అన్నాడు. బౌలింగ్ చేసినప్పుడు మాత్రమే పిచ్ ఎలా ఉందో తెలుసుకోవడానికి తాను ఇష్టపడతానని అన్నాడు. సాధారణంగా బౌలర్లు గ్రౌండ్‌లోకి వచ్చాక పిచ్‌ని పరిశీలిస్తుంటారని, తాను పిచ్ దగ్గరికి వెళ్లబోనని షమీ చెప్పాడు. బౌలింగ్ చేసినప్పుడు మాత్రమే పిచ్ స్వభావం అర్థమవుతుందని, అలాంటప్పుడు ఎందుకు ఒత్తిడి ఎదుర్కోవాలని, ప్రశాంతంగా ఉంటే మెరుగ్గా రాణిస్తారని షమీ అన్నాడు. ఇక ఇటీవలే ముగిసిన వరల్డ్ కప్‌లో మొదటి నాలుగు మ్యాచ్‌లకు దూరమవ్వడంపై స్పందిస్తూ.. బెంచ్‌లో కూర్చున్నప్పుడు మానసికంగా దృఢంగా ఉండాలని షమీ అన్నాడు. ఆటగాళ్లు కొన్నిసార్లు ఒత్తిడికి లోనవుతుంటారని, కానీ జట్టు చక్కగా ప్రదర్శన చేస్తూ దూసుకుపోతున్నప్పుడు ఆ ఆటగాడికి సంతోషం కలిగిస్తుందని అన్నాడు.ఇదిలావుంచితే.. ఇటీవలే ముగిసిన వన్డే వరల్డ్ కప్ 2023లో పేసర్ మహ్మద్ షమీ అద్భుతంగా రాణించాడు. పాండ్యా చీలమండ గాయంతో వైదొలగడంతో నాలుగు మ్యాచ్‌ల తర్వాత తుది జట్టులో చోటు దక్కించుకున్నాడు. కేవలం 7 మ్యాచ్‌ల్లోనే 24 వికెట్లు తీసి అందరినీ మెప్పించాడు.

## ఐపీఎల్-2024కి దూరంగా ఉండాలని బెన్ స్టోక్స్ నిర్ణయం

**గత సీజన్ లో సీఎస్కే జట్టుకు ప్రాతినిధ్యం వహించిన స్టోక్స్**

**రూ.16.25 కోట్లకు స్టోక్స్ ను కొనుగోలు చేసిన సీఎస్కే**

**మోకాలి గాయంతో దాదాపు టోర్నీ అంతా రిజర్వ్ బెంచ్ కే పరిమితం**

**ఐపీఎల్-2024 సీజన్ కు ముందు టీమిండియా-ఇంగ్లండ్ మధ్య 5 టెస్టుల సిరీస్**

**జాతీయ జట్టు కోసం ఐపీఎల్ కు దూరం కానున్న స్టోక్స్**

గత ఐపీఎల్ సీజన్ లో ఫిట్ నెస్ లేక దాదాపు టోర్నీ మొత్తం రిజర్వ్ బెంచ్ కే పరిమితమైన ఇంగ్లండ్ స్టార్ ఆల్ రౌండర్ బెన్ స్టోక్స్ వచ్చే ఏడాది జరిగే ఐపీఎల్ కు కూడా దూరం కానున్నాడు. ఐపీఎల్-2023లో స్టోక్స్ ను చెన్నై సూపర్ కింగ్స్ రూ.16.25 కోట్ల భారీ మొత్తానికి కొనుగోలు చేసింది. అయితే స్టోక్స్ ఆ సీజన్ లో ఆడింది రెండు మ్యాచ్ లే. మోకాలి గాయం తిరగబెట్టడంతో టోర్నీలో మిగిలిన మ్యాచ్ లు ఆడలేకపోయాడు. ఈ నేపథ్యంలో, చెన్నై సూపర్ కింగ్స్ బెన్ స్టోక్స్ విషయంలో ఇవాళ ఓ ప్రకటన చేసింది. ఐపీఎల్-2024లో స్టోక్స్ ఆడడంలేదని వెల్లడించింది. పనిభారం, ఫిట్ నెస్ సమస్యల వల్ల స్టోక్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు సీఎస్కే వివరించింది. ఐపీఎల్-2024 సీజన్ కు ముందు ఇంగ్లండ్ జట్టు టీమిండియాతో 5 టెస్టుల సిరీస్ ఆడనుందని, ఐపీఎల్ ముగిశాక టీ20 ప్రపంచకప్ జరగనుందని... ఈ నేపథ్యంలో, స్టోక్స్ నిర్ణయాన్ని సీఎస్కే యాజమాన్యం గౌరవిస్తున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

32 ఏళ్ల స్టోక్స్ ఐసీసీ వరల్డ్ కప్ కోసం వన్డే ఫార్మాట్లో రిటైర్ మెంట్ ను కూడా పక్కనబెట్టి ఇంగ్లండ్ జట్టులోకి వచ్చాడు. అయితే, టోర్నీలో తొలి మూడు మ్యాచ్ లకు దూరంగా ఉన్న స్టోక్స్... మిగతా మ్యాచ్ ల్లోకి అందుబాటులోకి వచ్చినా అప్పటికే ఇంగ్లండ్ కుదేలైంది. ఈ టోర్నీలో స్టోక్స్ ఒక సెంచరీ, రెండు అర్ధసెంచరీలు సాధించాడు. అయితే, తాను ఆడిన 6 మ్యాచ్ ల్లో స్టోక్స్ ఒక్క మ్యాచ్ లోనూ బౌలింగ్ చేయలేదు.



# నవంబర్ 30 హాలీడే కాదు ఓటింగ్ డే

**అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి**
**ఓటర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ విజ్ఞప్తి**

తెలంగాణ వీణ, హైదరాబాద్ : తెలంగాణ ఎన్నికల పోలింగ్ రోజున ప్రభుత్వం సెలవు ప్రకటించిందని.. అలాగని ప్రతి ఒక్కరు ఆ రోజును హాలిడే (సెలవు రోజు)గా కాకుండా ఓటింగ్ డే (ఓటు వేసే దినం)గా గుర్తించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికలఅధికారి వికాస్‌రాజ్ కోరారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తిచేశారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదవుతున్నదని, ఈసారి పెంచేందుకు చర్యలుతీసుకుంటున్నామని చెప్పారు. ఓటు వేయడం ప్రతి ఒక్కరి విధి, బాధ్యత అని పేర్కొన్నారు. ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో ఓటర్లు ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికలసంఘం అన్ని రకాల ఏర్పాట్లు చేసిందని తెలిపారు. బీఆర్‌కేఆర్ భవన్‌లో గురువారం ఆయన ఇతర అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఓటర్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 35,655 పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేశామని, పోలీసులు సహా దాదాపు మూడు లక్షల మంది ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో 4,70,270 పోస్టల్ బ్యాలట్‌లను ప్రింట్ చేశామని,ఈవీఎంల కోసం 8,84,584 బ్యాలట్ పేపర్లను ముద్రించామని చెప్పారు. టెండర్ ఓటు, చాలెంజ్ ఓటు కోసం అదనంగా బ్యాలెట్ పేపర్లను ముద్రించామని తెలిపారు. 51 లక్షల ఓటరు గుర్తింపు కార్డులను ముద్రించి పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఇండ్లకు పంపించామని చెప్పారు.

# బీజేపీనే గెలిపించాలని ప్రచారం



తెలంగాణవీణ, మల్కాజిగిరి; బారతీయ జనతా పార్టీ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పనిచేస్తోందని రానున్న ఎన్నికల్లో బీజేపిని గెలిపించాలని కోరుతూ పార్టీ అభ్యర్థి రామచంద్రరావు ఎన్నికల ప్రచారాన్ని మమ్మురంగా నిర్వహిస్తోన్నారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా అల్వాల్ మున్సిపల్ పరిధిలోని సుభాష్ నగర్ ప్రధాన రహదారిలో రోడ్డు పక్కన చెప్పులు కుట్టుకునే రాములును కలిసి బీజేపీకే ఓటేసీ గెలిపించాలని అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు వివరిస్తూ బీజేపి అధికారంలోకి వస్తే చేతి వృత్తులకు తగిన ప్రోత్సహాన్ని కల్పిస్తోందన్నారు. ప్రజా సేవ కోసమే తాను ఎన్నికల్లో పోటీచేస్తూన్నారని అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. మల్కాజిగిరి గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయటం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇరురాల మురళి కృష్ణ, దేవేందర్, మహేందర్ రెడ్డి, బన్సిల్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో రాబోయేది
# మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే

**గ్రామాలలో ప్రచారం నిర్వహించిన అచ్చంపేట అసెంబ్లీ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు**



నాగర్ కర్నూల్ 24 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం లింగాల మండల పరిధిలోని రాయవరం, పాత రాయవరం, ధారారం గ్రామాలలో నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించిన అచ్చంపేట అసెంబ్లీ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ గువ్వల బాలరాజు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉండాలంటే మరోసారి తనకు అవకాశం కల్పించాలని ఓటర్లను అభ్యర్థించారు. బిఆర్ఎస్ పార్టీ తోనే రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలతో పాలన అందుతుందని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత గ్రామాలలో అన్ని రకాల సకల సదుపాయాలు ముఖ్యమంత్రి కేసీఆర్ గారు కల్పించారని, మీ అందరి ఆశీర్వాదంతో మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు గ్రామానికి వచ్చిన అచ్చంపేట అసెంబ్లీ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ గువ్వల బాలరాజు గారికి ప్రజలు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మాకం తిరుపతయ్య, కేటి తిరుపతయ్య, మండల పార్టీ అధ్యక్షుడు సుధీర్ గౌడ్, పీ ఏ సీ ఎస్ ఛైర్మెన్ ఆనంద్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు అశోక్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు సునీత, కవిత శ్రీనివాసులు, స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# హస్తం గూటికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అబ్రహం



తెలంగాణ వీణ, హైదరాబాద్ : అ ల ంపూర్ ఎమ్మెల్యే అబ్రహం శుకరవారం నాడు కాంగ్రెస్ లో చేరారు. ఏఐసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ అభ్యర్థి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. జూబ్లీహిల్స్ లోని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పటికే అలంపూర్ నియోజక వర్గం నుంచి బిఆర్ఎస్ కు చెందిన నలుగురు జెడ్పిటిసిలు, ముగ్గురు ఎంపీపీ లు పలువురు ఎంపీటీసీ లు, సర్పంచులు కాంగ్రెస్ పార్టీ లో చేరిన విషయం తెలిసిందే. పోలింగ్ కు మరో వారంరోజులే వున్న సమయంలో బీఆరెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహం షాకిచ్చారు. సిట్టింగ్ ఎమ్మెల్యే అయినప్పటికీ తనకు ఆలంపూర్ టికెట్ ఇవ్వకపోవడంతో బిఆర్ఎస్ పై అసంతృప్తితో ఉన్న అబ్రహం కు ఏఐసిసి కార్యదర్శి, ఆలంపూర్ కాంగ్రెస్ అభ్యర్థి సంపత్ కుమార్ సంప్రదింపులు జరిపారు. తన గెలుపు కోసం సహకరిస్తే భవిష్యత్ లో మంచి అవకాశాలు ఇస్తామని ఒప్పించారు. దీంతో నేడు లాంచనంగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

# కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా

**ఎమ్మెల్యే వివేకానంద గౌడ్**
**నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే గెలిపిస్తాయ్**
**అశిర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తా**





తెలంగాణ వీణ, కుత్బుల్లాపూర్ ; కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యన్ని దశల వారిగా పరిష్కరించి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దానని ఎమ్మెల్యే వివేకానందగౌడ్ పేర్కొన్నారు. ఎన్నో సమస్యలతో సతమతమవుతున్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నేడు అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందనడంలో ఏలాంటి సందేహం లేదని ఇందుకు తన హాయంలో చేపట్టిన కార్యక్రమాలో నిలువెత్తు నిదర్శణం .2014 నుండి తొమ్మిది సంవత్సరాల కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజా సమస్యల పరిష్కరంలో ఎనలేని సేవలందించాడు. తాగునీటి సమస్యను నిర్మూలించడంలో ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ గారు సఫలమయ్యడు అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అన్నా అంటే నేనున్నానంటూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాడు, తాను చేసిన కార్యక్రమాలే తిరిగి రానున్న ఎన్నికల్లో బారీ మెజార్టీతో గెలిపిస్తారనీ ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో చేపట్టిన కార్యక్రమాలను వెల్లడించారు. నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ 4516 మంది లబ్ధిదారులకు 28 కోట్ల 94 లక్షల నగదు సహాయం అందించాననీ, సొంత నిధులతో బౌదురుపల్లిలో ఒకేషనల్ కాలేజ్ నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సొంత నిధులతో ఉచిత బస్సు పాసుల సౌకర్యాన్ని కల్పించారు. పోలీస్ కోచింగ్ తీసుకున్న విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తూనే , మెడిసిన్లో సీటు పొందిన పేద విద్యార్థులకు వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం అందించారు. గిఫ్ట్ ఏ స్మైల్ లో భాగంగా 200 మంది పేద విద్యార్థులకు సొంత నిధులతో లాప్టాప్ లతో పాటు 135 మంది దివ్యాంగులకు స్కూటీల అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అయినటువంటి దళిత బంధు ద్వారా వంద మందికి రూ. 10 కోట్లు , 543 మందికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ. 12 కోట్లు 41 మందికి ఎస్టీ కార్పొరేషన్ ద్వారా కోటి రూపాయలు 155 మందికి బీసీ కార్పొరేషన్ ద్వారా 97 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. అదనంగా రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ద్వారా నియోజకవర్గంలో ఉన్నటువంటి జిహెచ్ఎంసి పరిధి దుండిగల్ మున్సిపాలిటీ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాలలో మున్సిపల్ నిధుల ద్వారా సిసి రోడ్ల నిర్మాణం అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం మంచినీటి సరఫరా,స్ట్రీట్ లైట్లు,సీసీ కెమెరాలు నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణం, 58 జీవో ద్వారా ఉచిత పట్టాల పంపిణీ, ఆసరా పెన్షన్లు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 102 మహాప్రస్థానాలు 39 కోట్ల రూపాయలతో నిర్మాణ పనులు చేపట్టారు. రూ. 50 కోట్ల తో 30 చెరువులను ఆధునీకరించి, కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ద్వారా 11వేల మంది లబ్ధిదారులకు రూ. 12 కోట్ల రూపాయల అందజేశారు. భగత్ సింగ్ నగర్ లో 4 కోట్ల రూపాయలతో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం, ఇంటింటికి నల్ల కనెక్షన్ల ద్వారా మంచినీటి కొరతను నివారించడానికి సుమారు 500 కోట్ల రూపాయలతో 808 కిలోమీటర్ల పైప్ లైన్ పనులు, 6 రిజర్వాయర్లు 23 వాటర్ ట్యాంకులు నిర్మాణం చేపట్టారు. నియోజకవర్గంలో 15వేల డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి గాను 1400 కోట్ల వెచ్చించారు. నియోజ క వ ర్గ ంలో కొత్తగా మూడు మండలాల ఏర్పాటు రెండు డీసీపీ జోన్ కార్యాలయాలు ఐదు పోలీస్ స్టేషన్లు రెండు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించామన్నారు. విద్యుత్ ఆధునికరణ కోసం రూ. 265 కోట్ల , పార్కులు, ఉద్యానవనాల ఏర్పాటుకు రూ. 50 కోట్లతో పాటు రూ. 1600 కోట్ల రూపాయలతో మౌలిక సదుపాలైన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సిసి రోడ్ల పనులను చేపట్టినట్లు వివరించారు. నియోజకవర్గానికి ఆనుకొని ఉన్న రహదారుల నిర్మాణ కోసం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 900 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ఆసరా పెన్షన్లు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ దళిత బంధు సకాలంలో అందేలా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. పాఠశాలల ఆధునికరణ, బస్తీ దవఖానాలు ఏర్పాటు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. గడిచిత తొమ్మిదేళ్ల కలంలో సుమారు 6000 వేల కోట్ల రూపాయల నిధుల కేటాయింపుతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పర్చాపని తెలిపారు . నియోజవర్గంలో మెగా జాబ్ మేళా నిర్వహించడం ద్వారా 118 కంపెనీలలో 1000 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించామన్నారు. ఈ అభివృద్ధి పనులే కాకుండా వ్యక్తిగతంగా కూడా నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండి ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిలాగా కుత్బుల్లాపూర్ ప్రజల్లో మన్ననలు పొంది రెండు పర్యయాలు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందిస్తూ కుత్బుల్లాపూర్ అభివృద్ధికి కేరాఫ్ గా మారారు. రానున్న ఎన్నికల్లో హాట్రీక్ దిశగా వివేకనందగౌడ్ నియోజకర్గంలో మమ్మురంగా ప్రచారం నిర్వహిస్తు తనదైన శైలీలో దూసుకెళ్తున్నారు.














# ఉప్పల్‌లో బిఎల్ఆర్ గెలుపు ఖాయం

**పావని రెడ్డి**

తెలంగాణవీణ, కాప్రా ; ఉప్పల్ నియోజకవర్గం ప్రజలంతా బిఆర్ఎస్ పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ఏ ఎస్ రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి ధీమా వ్యక్తం చేసారు, ఇసిఐఎల్ లోని కమలనగర్, కాలనీలలో గడప గడపకు ప్రచార కరపత్రాలను ఓటర్లకు పంచుతూ ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు, ఈ సందర్భంగా పావని రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ల పాలనలో రాష్ట్రంలో చేపట్టిన ప్రగతిని, భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ తనదైన శైలీలో ప్రచారన్ని మమ్మురం చేశారు. గత దశాబ్ద కాలంగా ప్రజాసేవలో ఉన్న ఉప్పల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు లక్ష్మారెడ్డికి,ఓటు వేసి భారీ మెజార్టీ తో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





# రిజర్వ్ లో ఉన్న కంట్రోల్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ పూర్తి

**కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్**

తెలంగాణ వీణ, పెద్దపల్లి : అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా రిజర్వ్ లో ఉన్న కంట్రోల్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ కట్టుదిట్టంగా పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి రిజర్వ్ కంట్రోల్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా రిజర్వ్ కంట్రోల్ యూనిట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్ లైన్ విధానం ద్వారా చేపట్టినట్లు తెలిపారు. రామగుండం అసెంబ్లీ నియోజకవర్గానికి 67 కంట్రోల్ యూనిట్లు, మంథని అసెంబ్లీ నియోజకవర్గానికి 83, పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి 83 కంట్రోల్ యూనిట్లు ర్యాండమైజేషన్ ప్రక్రియతో కేటాయించా మని అన్నారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా ఏ ఈవిఎం యంత్రం ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో వెళ్తుందో ఆన్ లైన్ ఎన్నికల కమిషన్ రూపొందించిన సాఫ్ట్ వేర్ మాత్రమే నిర్దేశిస్తుందని, ఎట్టి పరిస్థితుల్లో ఈవీఎం యంత్రాన్ని ఇతరులు కంట్రోల్ చేయడం కుదరదని అన్నారు. కంట్రోల్ యూనిట్ సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ సంబంధించి హర్డ్ కాపీలు, సాఫ్ట్ కాపీలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాష్, డి.టి. షఫీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


Published and printed by Vulloju Srinivas on behalf of sri veena Publications Printed at Telangana Veena Flat No: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med Responsible for Selection of News Under the PRB Act) Phone Number: 040 3566 8720, RNI Reg No. TELTEL/12280 Reproduction in whole or in part without written